

ఇస్రో ఛైర్మన్‌కు ఘన స్వాగతం



గోపాలపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తల సదస్సులో పాల్గొనడానికి ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ మంగళవారం రాత్రి 7.30 గంటలకు నగరానికి చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో పలువురు శాస్త్రవేత్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన నగరానికి బయలుదేరి వెళ్లారు.

నగరంలో

కిడ్నీ రాకెట్?

కిడ్నీ విక్రయించేందుకు గత నెల 30న ఏలూరు జిల్లా నుంచి నగరానికి వచ్చిన ఇద్దరు...

అక్కయ్యపాలెంలోని హోటల్‌లో దిగి వైద్యుడితో ఫోన్‌లో మంతనాలు

ఫోర్ట్‌ టౌన్‌ స్టేషన్‌కు హోటల్‌ సిబ్బంది సమాచారం

- ఇద్దరినీ తీసుకువెళ్లిన పోలీసులు
- గుట్టుగా ఉంచడంతో సీపీకి చేరిన సమాచారం
- 15 రోజుల తర్వాత రాత్రివేళ మీడియాకు వాట్సాప్ మెసేజ్ ద్వారా సమాచారం ఇచ్చిన వైనం
- ఈ ఉదంతంలో పెద్దఎత్తున డబ్బు చేతులు మారిందనే ఆరోపణలు
- అలాంటిదేమీ లేదని ఖండిస్తున్న సీఐ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఏదైనా కేసుని ఛేదించినా, నేరం జరగకుండా ముందుగా అడ్డుకున్నా, నేరస్థులను అదుపులోకి తీసుకున్నా...పోలీసులు వెంటనే వివరాలను ఉన్నతాధికారులకు చేరవేస్తారు. ఒకటి, రెండు రోజుల తర్వాత మీడియాకు వెల్లడించడం పరిపాటి. కానీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా కిడ్నీ విక్రయించేందుకు సిద్ధపడిన ఒక వ్యక్తితోపాటు అతని స్నేహితుడిని అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు 15 రోజుల తర్వాత ఆ వివరాలను వెల్లడించారు. అది కూడా వాట్సాప్‌లో చిన్న మెసేజ్ పెట్టి చేతులు దులిపేసుకున్నారు. ఫోర్త్‌టౌన్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన ప్రస్తుతం నగర పోలీస్ శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది.

ఏలూరు జిల్లా జిల్లా కలిదిండి మండలం గురయ్యపాలేనికి చెందిన కట్టా రంగబాబు (36), చిల్లుముంత ఏసురాజు (30) స్నేహితులు. రంగబాబు తాను వ్యాన్ కొనాలనుకుంటున్నానని, విశాఖలో ఒక వ్యాన్ ఉన్నందున చూసి వద్దామంటూ స్నేహితుడైన ఏసురాజును తీసుకుని గత నెల 30న విశాఖ వచ్చాడు. అక్కయ్యపాలెం జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఒక హోటల్‌కు వెళ్లారు. అక్కడ రంగబాబు ఎవరితోనో మాట్లాడుతూ తన కిడ్నీని విక్రయించేందుకు బేరమాడుతుండడంతో ఏసురాజు షాక్‌కు గురయ్యాడు. వ్యాన్ కొనడానికి అనిచెప్పి తీసుకొచ్చి కిడ్నీ అమ్మేస్తానంటున్నావేమిటని రంగబాబును ఏసురాజు ప్రశ్నించగా, తనకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నందున కిడ్నీ అమ్మేయాలనుకుంటున్నానని చెప్పాడు. దీంతో రంగబాబు భార్యకు ఏసురాజు ఫోన్ చేసి సంగతి చెప్పడంతో ఆమె తన భర్తను మందలించి ఇంటికి రావాలని చెప్పింది. ఈ తతంగాన్ని చూసిన హోటల్ సిబ్బంది ఫోర్త్ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి ఇద్దరినీ స్టేషన్‌కు తీసుకువెళ్లి కిడ్నీలు విక్రయించడం నేరమని మందలించి వారి నుంచి వాంగ్మూలం తీసుకుని పంపించేశారు. ఇదంతా గత నెల 30న జరిగితే ఫోర్త్ టౌన్ పోలీసులు మాత్రం ఈనెల 13న జరిగినట్టు పేర్కొంటూ వాట్సాప్‌లో ఒక చిన్న మెసేజ్ పెట్టడం అనుమానాలకు దారితీసింది.

ఇదిలావుంటే ఈ వ్యవహారంలో ఫోర్త్ టౌన్‌లోని కొందరు పోలీసులు పెద్ద తతంగమే నడిపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెల 30న ఇద్దరు వ్యక్తులు కిడ్నీ విక్రయించేందుకు వచ్చి ఎవరితోనూ సంప్రతింపులు జరుపుతున్నారంటూ ఫోర్త్ టౌన్‌లో పనిచేస్తున్న ఒకరికి హోటల్ సిబ్బంది నుంచి సమాచారం వచ్చింది. సమాచారం అందుకున్న వ్యక్తి విషయాన్ని ఒక ఎస్ఐకు తెలియపరిచారు. సదరు ఎస్ఐ స్టేషన్‌లో కీలక విధులు నిర్వర్తిస్తున్న ఒకరిని పిలిచి తక్షణం జీపులో ఆ హోటల్‌కు వెళ్లి ఆ ఇద్దరినీ స్టేషన్‌కు తీసుకురావాలని ఆదేశించారు. ఎస్ఐ ఆదేశాల మేరకు హోటల్‌కు వెళ్లి ఇద్దరు వ్యక్తులను తీసుకువచ్చిన స్టేషన్‌లోని కీలక విధులు నిర్వర్తించే ఒకరు విషయాన్ని స్టేషన్‌లోని పనిచేస్తున్న ఒక అధికారికి తెలియజేశారు. వారిద్దరూ కలిసి హోటల్‌లో కిడ్నీలు విక్రయం గురించి చర్చించుకున్న ఇద్దరిని విచారించారు. తనకు ఫేస్‌బుక్‌లో విశాఖకు చెందిన ఒక వైద్యుడితో పరిచయం ఏర్పడిందని రంగబాబు చెప్పినట్టు సమాచారం. తనకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని వైద్యుడికి చెప్పగా, కిడ్నీ విక్రయిస్తే చాలా డబ్బులు వస్తాయని అనడంతో తన స్నేహితుడికి వ్యాన్ కొనుగోలు చేయడానికి అని చెప్పి విశాఖ తీసుకువచ్చినట్టు వివరించినట్టు తెలిసింది. సదరు వైద్యుడితోపాటు కిడ్నీల విక్రయం ముఠాలో ఎవరెవరు ఉన్నారనే దానిపై పోలీసులు కూపీ

... మిగతా 4వ పేజీలో

మహా మాయ

పార్కు అభివృద్ధి పేరిట మేసేశారు



రూ.1.6 కోట్ల వ్యయంతో నిర్మించినట్టు చెబుతున్న ప్రహరీ గోడ

ఫేకర్ లేఅవుట్‌లోని పార్కు అభివృద్ధికి రూ.1.6 కోట్లతో రెండేళ్ల క్రితం వైసీపీ హయాంలో టెండర్లు

- ఒక్కొక్క పనికి రూ.20 లక్షలు కేటాయింపు
- ఒక్కటి మినహా అన్నీ పూర్తయినట్టు బిల్లుల చెల్లింపు
- అక్కడ చూస్తే... జరిగింది ఒక్కటే
- అన్నింటి నిధులు ప్రహరీ గోడ నిర్మాణానికే వెచ్చించినట్టు చెబుతున్న కాంట్రాక్టర్
- ప్రహరీ మినహా మిగిలిన పనులు జరగకపోయినా బిల్లు రికార్డు చేసిన అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సమీపంలో గల ఫేకర్ లేఅవుట్‌లోని పార్కులో వైసీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్కులో పనులకు రెండేళ్ల క్రితం జీవీఎంసీ రూ.1.6 కోట్లతో టెండర్లు పిలిచింది. అందులో రూ.20 లక్షలు విలువైన పని మినహా మిగిలినవన్నీ పూర్తిచేసినట్టు రికార్డుల్లో చూపించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించేశారు. అయితే పార్కులో చూస్తే ఒక ప్రహరీ మినహా మిగిలిన పనులు జరిగిన ఆనవాళ్లే లేవు.

వాల్తేరు టౌన్ సర్వేనంబర్ 76లో ఫేకర్ లేఅవుట్ లేఅవుట్ (28వ వార్డు పరిధి) వేశారు. అందులో సుమారు 4,500 గజాల స్థలాన్ని పార్కు స్థలంగా చూపించి జీవీఎంసీకి మార్టిగేజ్ చేశారు. అప్పటి నుంచి ఆ స్థలం పిచ్చిమొక్కలతో ఖాళీగానే ఉంది. దానిని చేజిక్కించుకునేందుకు కొందరు చాలా కాలంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. దీంతో లేఅవుట్ అసోసియేషన్ ప్రతినిధులు పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలంటూ జీవీఎంసీ అధికారులను కోరడంతో రెండేళ్ల కిందట రూ.1.6 కోట్లతో ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు తయారుచేశారు. పార్కు లోపల రూ.20 లక్షలతో వాకింగ్ ట్రాక్, రూ.20 లక్షలతో పార్కింగ్, వాచ్‌మెన్ గది నిర్మాణం, రూ.20 లక్షలతో పార్కు ప్రవేశద్వారం, గేటు ఏర్పాటు, రూ.20 లక్షలతో వాటర్ ఫౌంటెయిన్, రూ.20 లక్షలు వ్యయంతో రక్షణ గోడల నిర్మాణం, రూ.20 లక్షలతో సాఫ్ట్ ల్యాండ్‌స్కేపింగ్, పిల్లల ఆట పరికరాల ఏర్పాటు, స్టేజీ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి వేర్వేరుగా టెండర్లు పిలిచారు. అందులో రూ.20 లక్షల విలువైన పని మినహా మిగిలిన రూ.1.4 కోట్ల విలువైన పనులను ఒకేకాంట్రాక్టర్ దక్కించుకున్నారు. అయితే పార్కులో ఒకవైపు ప్రహరీ నిర్మాణం మినహాయిస్తే మిగిలిన పనులేవీ జరగలేదు. కానీ అన్నిపనులు పూర్తయినట్టు అధికారులు మాత్రం కాంట్రాక్టర్‌కు రూ.1.4 కోట్లు చెల్లించేశారు. ఆయా పనులను చేపట్టిన కాంట్రాక్టర్‌ను పనుల గురించి ఆరా తీయగా, అన్ని వర్కులకు మంజూరైన నిధులను ప్రహరీ నిర్మాణానికే వెచ్చించామని చెప్పుకొచ్చారు.

చేయని పనులకు బిల్లు చేసిన అధికారులెవరు?

ఏదైనా పని జరుగుతున్నట్టయితే ఇంజనీరింగ్ విభాగం నుంచి సంబంధిత వార్డు వర్క్ ఇన్‌స్పెక్టర్/అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దగ్గరుండి పర్యవేక్షించాలి. నాణ్యతతోపాటు డ్రాయింగ్‌లో పేర్కొన్నట్టు పని జరుగుతోందా?, లేదా? అని చూడాలి. పని పూర్తయిన తర్వాత క్వాలిటీ కంట్రోల్ అధికారులు వెళ్లి నాణ్యతను పరిశీలించి సర్టిఫికెట్ జారీచేయాలి. అనంతరం ఏఈ స్థాయి అధికారి అక్కడ జరిగిన పనికి కొలతలు వేసి, ఎం-బుక్‌లో రికార్డు చేయాలి. ఎం-బుక్‌ను డీఈలకు పంపించి సంబంధిత జోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ద్వారా సంబంధిత అధికారికి బిల్లు పంపించాలి. అవసరమైతే ఏ అధికారి అయినా బిల్లుపై సంతకం చేసేముందు ఆయా పనులను పరిశీలించాలి. అయితే ఫేకర్ లేఅవుట్ పార్కులో పనులకు సంబంధించి ఈ ప్రక్రియ జరిగిందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అది సక్రమంగా జరిగినట్టయితే జరగని పనులకు బిల్లు చెల్లించాలని ఎలా ప్రతిపాదిస్తారంటూ ఎవరో ఒకరు ప్రశ్నించాలి. కానీ పనులు జరగకపోయినా కాంట్రాక్టర్‌కు బిల్లులు ఎలా చెల్లించారనేది అర్థం కావడం లేదు. ఒకవేళ అధికారులు, కాంట్రాక్టర్ చెబుతున్నట్టు వర్క్ డీవియేషన్ వెసులుబాటు కింద ఒకేపనికి అన్ని పనులకు సంబంధించిన డబ్బును ఖర్చు పెట్టేశారనుకున్నా...అక్కడ ప్రహరీ గోడ ఆ స్థాయిలో కనిపించడం లేదని ఇంజనీరింగ్ అధికారులు కొందరు

... మిగతా 4వ పేజీలో

వర్షాకాలంలో 7,00,000 మొక్కలు పంపిణీ

- సామాజిక వన విభాగం లక్ష్యం
- పాఠశాలలకు రెండు లక్షలు
- రైతులకు ఉచితంగా ఐదు లక్షల నీలగిరి, సరుగుడు మొక్కలు
- ఈ ఏడాది మొత్తమ్మీద పది లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్న జిల్లా యంత్రాంగం



నర్సరీల్లో మొక్కలు

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో నాటేందుకు వివిధ రకాలకు చెందిన 7.2 లక్షల మొక్కలను పంపిణీ చేయాలని అటవీ శాఖకు చెందిన సామాజిక వన విభాగం లక్ష్యంగా పెట్టుకుంది. పాఠశాలల విద్యార్థులకు ఇప్పటికే రెండు లక్షల మొక్కలు అందజేసింది. ఇక రైతుల కోసం ఉపాధి హామీ పథకం కింద నర్సరీల్లో దాదాపు ఐదు లక్షల వరకూ సరుగుడు, నీలగిరి మొక్కల పెంపకం చేపట్టారు. సరుగుడు, నీలగిరి మొక్కలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం రైతులు భూమికి సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలు, పంచాయతీ కార్యదర్శి నుంచి లేఖ తీసుకుని సమీపంలో నర్సరీలకు వెళ్లాలని ఇన్‌చార్జి డీఎఫ్‌వో జి.మంగమ్మ తెలిపారు. జిల్లాలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాల్లో రైతులు ఎక్కువగా సరుగుడు పెంపకంపై మొగ్గు చూపుతున్నారు. తీరానికి ఆనుకుని ఉన్న గ్రామాలకు చెందిన రైతులు సరుగుడుతో పాటు నీలగిరి నాటుతున్నారు. కాగా పాఠశాలలకు పంపిణీ చేయగా మిగిలిన రకాలను జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలలో నాటేందుకు

... మిగతా 4వ పేజీలో

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మానసిక వైద్యశాల



మానసిక వైద్యశాలలో నూతన భవనాలకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి వై.సత్యకుమార్ యాదవ్. చిత్రంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, మానసిక వైద్య శాల సూపరింటెండెంట్ డాక్టర్ కేపీ రామిరెడ్డి, ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కేవీఎస్ఎం సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఉన్నారు. - మెయిన్ 9వ పేజీలో

స్మార్ట్ మీటర్లపై సీపీఎం నిరసన



లాంతర్లతో నిరసన తెలియజేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు కె.లోకనాథం, జిల్లాకార్యదర్శి ఎం.జగ్గునాయుడు

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అదానీకి లబ్ధి చేకూర్చడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ప్రజలపై రుద్దుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో సింగ్‌హోటల్ జంక్షన్ వద్ద మంగళవారం లాంతర్లతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడిన కూటమి నేతలు ఇప్పుడు ఆ వాగ్దానాలను ఉల్లంఘించి ప్రతి ఇంటికీ స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు సిద్ధపడుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లను అన్నిరాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నందున ఏపీలో వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ప్రీపెయిడ్ మీటర్లతో ప్రజలను దోచుకునే అవకాశం ఉన్నందున ఆ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు కె.లోకనాథం, జిల్లాకార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు బి.గంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదాల్లో వారే బలి

అత్యధికులు 'ప్రొడక్షన్'తో సంబంధం లేని విభాగాలకు చెందినవారు...

- ఉత్పత్తి విభాగం ప్రత్యేకంగా ఉండాలన్న నిబంధన బేఖాతరు చేస్తున్న యాజమాన్యాలు
- తెలంగాణలోని సిగాచీలో భారీ ప్రమాదంతో అప్రమత్తమైన అధికారులు
- ఇకపై 250 మంది కార్మికులు దాటితే సేఫ్టీ ఆఫీసర్
- సెన్సార్లన్నీ ఐటీటీతో కనెక్షన్



ఫార్మా పరిశ్రమలో అధికారుల తనిఖీలు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఫార్మా కంపెనీల్లో జరిగే ప్రమాదాల్లో మందుల ఉత్పత్తితో సంబంధం లేనివారే పెద్ద సంఖ్యలో చనిపోతున్నారు. నెల క్రితం విశాఖ ఫార్మా సిటీ (రాంకీ)లో సాయి శ్రేయాస్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో మరణించిన ఇద్దరూ ఉత్పత్తి విభాగానికి సంబంధం లేనివారే. గతంలో సాహితీ ఫార్మాలో జరిగిన ప్రమాదంలో కూడా వేరే విభాగాలవారు ఉన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇలాంటి ప్రమాదాలు చాలా జరుగుతున్నాయి.

నిబంధనల ప్రకారం ఉత్పత్తి చేసే ప్రాంతానికి (ప్రొడక్షన్ బ్లాక్) మిగిలిన విభాగాలు దూరంగా ఉండాలి. అంటే క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ ఎస్యూరెన్స్, పీడీ లేబొరేటరీలు వేరే దగ్గర ఉండాలి. కానీ కంపెనీల యాజమాన్యాలు స్థలం కలసి వస్తుందని అన్నింటినీ ఒక్క దగ్గరే పెడుతున్నారు. దాని వల్ల ఉత్పత్తి జరిగే ప్రాంతంలో ప్రమాదం జరిగితే దానితో సంబంధం లేనివారు కూడా చనిపోతున్నారు. సాహితీ ఫార్మాలో కూడా ఇలాగే జరిగింది. బిల్డింగ్ డిజైన్‌ను ఫ్యాక్టరీస్ విభాగం అధికారులు సరిగా తనిఖీ చేయకపోవడం, ఉత్పత్తికి అనుమతులు ఇచ్చే ముందు క్షేత్ర పరిశీలనలో కూడా వీటిని పట్టించుకోకపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయి. తెలంగాణాలోని సిగాచీలో జరిగిన భారీ ప్రమాదం కూడా ఇలాంటిదేనని తేలడంతో ఇప్పుడు అధికారులు అప్రమత్తమై ఉత్పత్తికి

... మిగతా 6వ పేజీలో

పార్కుల్లో ఆక్రమణల తొలగింపు

- జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ స్పెషల్‌డ్రైవ్
- బింద్రానగర్ పార్కులోని షెడ్‌లు కూల్చివేత
- ఫేకర్ లేఅవుట్‌లోని పార్కు స్థలాన్ని
- చదును చేయించిన చీఫ్ సిటీ ప్లానర్



విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ పరిధిలోని పార్కుల్లో ఆక్రమణలను తొలగించే కార్యక్రమానికి మంగళవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు శ్రీకారం చుట్టారు. పార్కుల కబ్జాపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురిస్తున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌లు టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాలతో పలుమార్లు సమావేశమయ్యారు. జీవీఎంసీ పరిధిలో ఎన్ని పార్కులు ఉన్నాయి?, ఎన్ని ఓపెన్‌స్పేస్‌లు ఉన్నాయి?, ఎన్ని కబ్జాకు గురయ్యాయి?, ఎన్ని కోర్టు కేసుల్లో ఉన్నాయనే దానిపై బుధవారం నాటికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల వేదికలో కూడా పార్కుల ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులే అధికంగా రావడంతో వాటన్నింటిపైనా తక్షణం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు ఎనిమిదో వార్డు పరిధి బింద్రానగర్ లేఅవుట్‌లోని పార్కులో ఏళ్ల కిందట పలువురు నిర్మించిన షెడ్‌లను టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం యంత్రాలతో కూల్చివేశారు. అలాగే 28వ వార్డు పరిధి ఫేకర్ లేఅవుట్‌లోని పార్కు స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నట్టు తెలియడంతో 'మరో పార్కుకు ఎసరు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' మంగళవారం కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన కమిషనర్, మేయర్‌లు తక్షణం పార్కులోని ఆక్రమణలు, పొదలను తొలగించి చదునుచేసి, అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. చీఫ్ సిటీప్లానర్ ఎ.ప్రభాకరరావు, జోన్-4 ఏసీపీ ఝాన్సీ సిబ్బందితో కలిసి ఫేకర్


... మిగతా 6వ పేజీలో

17న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పర్యటన


విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈ నెల 17వ తేదీన విశాఖపట్నం వస్తున్నారు. ఆ రోజు రాత్రికి ఇక్కడే బస చేసి మరుసటిరోజు ఉదయం నేవల్ డాక్‌యార్డులో కొత్త నౌక ఐఎన్ఎస్ నిస్తార్‌ను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమం ముగించుకొని ఢిల్లీ వెళతారు.

నేడు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు బుధవారం విశాఖపట్నం వస్తున్నారు. బుధవారం ఉదయం ఆయన కిర్లంపూడి లేఅవుట్‌లోని ఇంద్రప్రస్థ నివాసానికి చేరుకుంటారు. 11.20 గంటలకు వాల్తేరు క్లబ్‌కు వెళ్లి అక్కడ దివంగత వేగేశ్న ఆనందరాజుకు నివాళులు అర్పిస్తారు. 20వ తేదీ వరకూ నగరంలోనే ఉంటారు.



కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



రాళ్లు తేలి గోతులతో ఉన్న రోడ్డు

అధ్వాన రహదారితో అవస్థలు

మధురవాడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని వాంబేకాలనీ నుంచి నగరంపాలెం వెళ్లే రహదారి గుంతలు పడి బురదతో నిండిపోవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.వాంబే కాలనీవాసులు మధురవాడ, నగరంపాలెం వెళ్లాలంటే ఈ రహదారినే వినియోగిస్తారు. వర్షం పడితే రోడ్డంతా బురదమయం కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు ద్విచక్ర వాహనదారులు బురదలో జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. వాంబేకాలనీ ఆఖరు వరకు సిమెంటు రోడ్డు ఉన్నా..పావు కిలోమీటరు గ్రావెల్ రోడ్డు కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు గతంలో ఈ రహదారిని సిమెంటు రోడ్డుగా మార్పు చేస్తామని ప్రకటించినా.. ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. గ్రావెల్ రోడ్డును సీసీ రోడ్డుగా మార్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నాణ్యత లేని పనులు



అల్లూరి పార్క్‌లో శిథిలమైన బ్రిక్స్

భీమునిపట్నం,జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్‌రోడ్‌లో జీవీఎంసీ చేపట్టిన పనుల్లో నాణ్యతా లోపం కనిపిస్తోంది. గత ఏడాది డిసెంబరులో జీసస్ పార్క్, అల్లూరి సీతారామ రాజుథీమ్ పార్క్ ముందు జీవీఎంసీ రూ. 5 లక్షలతో పలు నిర్మాణాలు చేపట్టింది. అల్లూరి పార్క్ ముందు పాత్‌వేగా ఇంటర్ లాకింగ్ బ్రిక్స్ ఏర్పాటు చేశారు. నాణ్యత లేకుండా నిర్మించడంతో ఆరు నెలల్లోనే బ్రిక్స్ విడిపోయి చెదిరిపోతున్నాయి. అధికారులు పనితీరుపై పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పడాల

ఆనందపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా వెల్లంకి గ్రామానికి చెందిన పడాల రమణ నియామితులయ్యారు. ఈమేరకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రమణ గతంలో భీమిలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా, మండల పార్టీ అధ్యక్షుడిగా సేవలందించారు. ఆయన నియామకం పట్ల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

డిగ్రీ విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ



విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి, అధ్యాపకులు

తగరపువలస, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డా. పి.శ్రీవాణి మంగళవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. స్వల్పకాలిక శిక్షణలో భాగంగా సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ అన్న అంశంపై 50 రోజుల పాటు విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారు. డేటా ప్రొ కంప్యూటర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించారు.

నగరపాలెంలో ఎల్లారమ్మకు సారె



భక్తులు సమర్పించిన సారె

భీమునిపట్నం (రూరల్), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నగరపాలెంలో ఎల్లారమ్మ తల్లికి భక్తులు మంగళవారం సారె సమర్పించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ అందించే కార్యక్రమంలో భాగంగా మహిళలు ఇళ్లల్లో పలు పిండి పదార్థాలు తయారు చేసి, ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. తొలుత బట్లాలమ్మ తల్లికి, కొత్తూరులో దుర్గాలమ్మ, జోడుగుళ్లమ్మ తల్లికి పసుపు కుంకుమలు అందించి, ఎల్లారమ్మ తల్లికి సారె సమర్పించారు.

జోన్-3 ఈఈని కలిసిన జేఎల్ఎంలు



సింహాచలంనాయుడుకు అభినందనలు తెలుపుతున్న జేఎల్ఎంలు

మధురవాడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బదిలీపై వచ్చిన బి. సింహాచలంనాయుడును జూనియర్ లైన్‌మెన్‌లు మంగళవారం మధురవాడ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్-3 పరిధిలోని జూనియర్ లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

అప్పన్న భక్తుల సేవల్లో అన్యమతస్తులు

సింహాచలం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు అన్యమతాలకు చెందిన వారితో సేవలు అందించడాన్ని విశ్వహిందూ పరిషత్ మందిర అర్చక పురోహిత్ విభాగం రాష్ట్ర సురక్షా ప్రముఖ్ పూడిపెద్ది శర్మ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.సెక్యులర్ భావాల పేరుతో అన్యమతాల వారికి దేవాలయ అధికారులే మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల హిందూ భక్తుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటు వంటి చర్యలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

50 మందికి ఉపకార వేతనాలు

డాబాగార్డెన్స్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం, భీమిలి, పద్మనాభం కేజీబీవీ పాఠశాలల్లో చదువుతున్న 50 మంది విద్యార్థులకు మాన్సాస్ ట్రస్టు విజయనగరం ఆధ్వర్యంలో ఆనంద గజపతిరాజు జయంతి పురస్కరించుకుని గురువారం ఉపకార వేతనాలు అందించనున్నట్టు సమగ్ర శిక్షా అదనపు సమన్వయకర్త చంద్రశేఖరరావు తెలిపారు. మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. 2024-25 వార్షిక పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 5 వేలు చొప్పున ఇవ్వనున్నట్టు చెప్పారు. విజయనగరంలో ఆ రోజు ఉదయం 9.30 గంటలకు గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

ఆదర్శంగా భీమిలి : ఎమ్మెల్యే గంటా

పీఎంపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కొమ్మాది, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : భీమిలి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన పీఎంపాలెం కాలనీలో రూ.1.77 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆర్‌హెచ్ కాలనీలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ 2014-19లో తాను మంత్రిగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిని భీమిలి ప్రజలు గుర్తించి 2024 ఎన్నికల్లో తిరుగులేని మెజారిటీతో గెలిపించారని, ప్రజల రుణం తీర్చుకోవడానికి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. ఏడాదిలో ఆరో వార్డులో 5 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని, పలుచోట్ల అసంపూర్తిగా ఉన్న పనులను కూడా పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. కూటమి పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికి పథకాలు అందిస్తామని, ఎన్నికల హామీలు అమలు చేస్తామని చెప్పారు. కాగా స్థానికులు తాగునీటి సమస్యను విన్నవించగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు టీడీపీ నాయకుడు గరే గురునాథ్, మన్యాల సోంబాబు, లొడగల జానకీ రామ్, యార్లగడ్డ జీవన్‌కుమార్, నాగోతి శివాజీ, మొల్లి లక్ష్మణరావు, బోయి వెంకటరమణ, పోలిశెట్టి నాగేశ్వరరావు, నాగోతి సూర్యప్రకాశ్, గొల్లంగి ఆనంద బాబు, పోతిన రఘు తదితరులు పాల్గొన్నారు.

'ఒడిశా కోళ్లను దిగుమతి చేయొద్దు'

ఆనందపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రలోని కోళ్ల రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా బ్రాయిలర్ అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కొట్యాడ శ్రీను, మాజీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు మాట్లాడుతూ కోళ్ల రైతులకు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఒడిశాలో బ్రాయిలర్ కోళ్లకు వైరస్ ఉందని, అక్కడ ప్రభుత్వం నిర్ధారించినట్టు చెప్పారు. వైరస్ సోకిన కోళ్లను మన రాష్ట్రానికి దిగుమతి చేస్తే ఇక్కడ కూడా ఆ వైరస్ సోకే ప్రమాదం ఉందన్నారు. గతంలో కూడా ఇటువంటి సంఘటనలు జరిగి రైతులు చాలావరకు నష్టాలు చూడాల్సిన పరిస్థితి వచ్చిందని వివరించారు. ఒడిశా నుంచి వైరస్ సోకిన బ్రాయిలర్ కోళ్లను మన రాష్ట్రంలోకి రాకుండా నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరర్ ఎస్. మన్మథరావు, సీనియర్ ఫార్మర్ రౌతు రమణ, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు, బాక్సులు పంపిణీ

తగరపువలస, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండవ వార్డు పరిధిలో మామిడిపాలెం బ్యాంకు కాలనీ, దెక్కితిపాలెం గ్రామాలకు చెందిన 50 మంది విద్యార్థులకు గ్రేస్ హ్యాపీనెస్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం పుస్తకాలు, పెన్నులు కంపాస్ బాక్సులు పంపిణీ చేశారు. ఆ సంస్థకు చెందిన పి. నవీన్ కుమార్ విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఉచిత వైద్య శిబిరాలు, నిరుపేదలకు నిత్యావసర సరకులు పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

సుద్దగెడ్డలో ప్లాస్టిక్ వ్యర్థాలు



గెడ్డలోకి వెళుతున్న వాడక నీరు



దివ్యాంగుల కాలనీ వద్ద గెడ్డలో ప్లాస్టిక్ వ్యర్థాలు

మధురవాడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని సుద్దగెడ్డ ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితమవుతోంది. గెడ్డలో ఎక్కడ చూసినా గుట్ట గుట్టలుగా ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్నాయి. మిథిలాపురి వుడా కాలనీ, పోర్టు కాలనీ, దివ్యాంగులకాలనీ,పాత మధురవాడ మెట్ట ప్రాంతాల ప్రజలకు భూగర్భ జలాలకు ఇదే ప్రధాన జలవనరు. కొన్ని కాలనీల ప్రజలు వాడుక నీటిని గెడ్డలోకి విడిచిపెడుతుండడంతో స్వచ్ఛంగా ఉన్న గెడ్డ నీరు కలుషితమవుతోంది. అలాగే పూడికలు నిండిపోవడంతో నీటిని నిల్వ ఉంచుకునే సామర్థ్యం కూడా తగ్గిపోయింది. పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి గెడ్డలోని ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడికలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి అక్కిరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన టి.సుధాకర్‌రెడ్డి, రామనిర్మల దంపతులు రూ, లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్ రూపంలో వారు ఆలయ ప్రజా సంబంధాల అధికారి సూర్యనారాయణకు మంగళవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సాగర్‌నగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : చిన్న రుషికొండ అంగన్‌వాడీ కేంద్రంలో వాసవ్య మహిళా మండలి కుషాల్ మెటర్నిటీ మెంటల్ హెల్త్ కార్యకర్తలు గర్భిణిలకు పౌష్టికాహారం గురించి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ కో ఆర్డినేటర్ కేవీ పార్వతి మాట్లాడుతూ గర్భిణిలకు సమతుల్య ఆహారం అవసరమన్నారు. ప్రొటీన్లు, కాల్షియం, ఫోలిక్ యాసిడ్ ఆహారంలో కచ్చితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. శరీరాన్ని డీహైడ్రేడ్ కానివ్వకుండా చూసుకోవాలని, పుష్కలంగా నీరు తాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, వాసవ్య మహిళా మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌కు వైదికుల ఆశీర్వాదం



అశోక్‌ను శాలువాతో సత్కరిస్తున్న ఈఓ త్రినాథరావు

సింహాచలం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజును కేంద్ర ప్రభుత్వం గోవా రాష్ట్రానికి గవర్నర్‌గా నియమించడం పట్ల దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అభినందనలు తెలిపారు. మంగళవారం అప్పన్న ఆలయ వైదిక అధికారులు విజయనగరంలో అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, వేద పండితులు జగన్మోహనశర్మ చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

బీఆర్‌టీఎస్ టీడీఆర్ కమిటీ సమావేశం ఎప్పుడు ?

సింహాచలం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణంలో ఆస్తులు కోల్పోయిన నిర్వాసితుల టీడీఆర్‌ల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నియమించిన కమిటీ ఒక్కసారి కూడా సమావేశం కాకపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్వాసితుల సమస్యలపై అధ్యయనం చేయడానికి అనుభవజ్ఞులైన సీనియర్ అధికారులతో ప్రభుత్వం గత నెల 17న కమిటీ వేసింది. నెల రోజుల్లో సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. రేపటితో కమిటీ నియామకం జరిగి నెల రోజులు పూర్తి కానున్నది. కానీ ఇప్పటివరకూ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించడం, నిర్వాసితుల సమస్యలు తెలుసుకోవడం, కనీసం సమావేశమై ప్రాథమికంగా చర్చించిన సందర్భం లేదు.

ఘనంగా పాదాలమ్మ పండుగ



సింహాచలం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి ప్రజల ఆరాధ్య దేవత పాదాలమ్మ వార్షిక పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు సతీసమేతంగా, కార్పొరేటర్ నరసింహం, మాజీ కార్పొరేటర్ పాశర్ల వసంత కల్యాణి ప్రసాద్, సింహగిరి నిర్వాసితుల కాలనీ నాయకులు సత్తిబాబు, మురళీ, ధర్మరాజు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన అధికారి శ్యామల

పామాయిల్ సాగుపై ప్రత్యేక దృష్టి

- జిల్లా ఉద్యానవన అధికారి శ్యామల

పద్మనాభం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు పామాయిల్ తోటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బి. శ్యామల చెప్పారు. కోరాడ పంచాయతీలోని గెద్దపేట నాదెండ్ల పూర్ణచంద్రరావు తోటలో మంగళవారం జరిగిన ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మెగా ప్లాంటేషన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ ఆహార నూనెల ఉత్పత్తి మిషన్ కార్యక్రమంలో భాగంగా ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. మొక్కలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోందని, నీటి సదుపాయం ఉన్న భూముల్లో ఈ తోటల పెంపకం ద్వారా రైతులు లాభాలు పొందవచ్చునని చెప్పారు. ఎకరాకి 50 మొక్కలు వేసుకోవాలన్నారు. రైతులు పండించిన ఆయిల్‌పాం పంటను ప్రభుత్వమే కంపెనీల ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. మార్కెట్ కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం టన్ను పామాయిల్ గెలలకు రూ.17340 ధర ఉందన్నారు. అనంతరం గెద్దపేటలో పామాయిల్ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టరు కె. మన్మథరావు, భీమిలి ఉద్యానవన అధికారి భాను పుష్పలీలావతి, పామాయిల్ కంపెనీ మేనేజరు శ్రీనివాసరావు, వీపీఏ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

బ్యూటిషియన్ శిక్షకులకు సర్టిఫికెట్లు

భీమునిపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో బ్యూటీషియన్ కోర్సులో ఉత్తీర్ణులైన శిక్షకులకు కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ మంగళవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కళాశాలలో నిర్వహించిన ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం పురస్కరించుకుని బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసిన 28 మందికి వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పోక్ సీహెచ్ దీపక్ రాకేశ్, స్కిల్ హబ్ కో -ఆర్డినేటర్ ఎస్. అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

709 దరఖాస్తులు స్వీకరణ

తగరపువలస, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్ మిల్లు కార్మికులు పరిహారాల కోసం ఇప్పటివరకు 709 దరఖాస్తులు అందించారని అధికార కార్మిక సంఘం (ఐఎన్‌టీయూసీ) వర్కింగ్ ప్రెసిడెంట్ జీరు వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 20వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని, యాజమాన్యం నుంచి ఎలాంటి పరిహారాలు పొందని కార్మికులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తులను కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పరిశీలించిన అనంతరం యాజమాన్యానికి అందిస్తామని చెప్పారు.



కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న మిల్లు సిబ్బంది



యువతి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

విద్యార్థిని ఆత్మహత్య

చదువుకునేందుకు ఆర్థిక సమస్య అడ్డంకిగా మారడమే కారణం

గోపాలపట్నం,జూలై 15 (ఆంధ్రజ్యోతి): చదువుకు ఆర్థిక సమస్యలు అడ్డంకిగా మారడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ దుర్ఘటన మంగళవా రం రాత్రి గోపాలపట్నం లోని ఇందిరానగర్‌లో చోటుచేసుకుంది. ఇందిరానగర్‌కు చెందిన వానపల్లి శృతి కీర్తన (18) ఇటీవల డిప్లొమా పూర్తిచేసింది. ఏపీఈసెట్‌లో 300 ర్యాంకు సాధించిన ఆమెకు ఇంజనీరింగ్‌లో చేరడానికి ఫ్రీ సీటు రాలేదు. కీర్తన తండ్రి సెల్‌ఫోన్ మెకానిక్‌గా పని చేస్తున్నారు. ఉన్నత చదువులు చదవాలన్న కుమార్తె ఆసక్తిని గమనించిన ఆయన ఎలాగైనా ఇంజనీరింగ్‌లో చేర్పించాలని కొద్దిరోజులుగా అప్పు కోసం ప్రయత్నిస్తున్నారు. మంగళవారం ఉదయం కొంత అప్పు చేశారు. తన చదువు కోసం తండ్రి అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతారని భావించిన కీర్తన రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పనిమీద బయటకు వెళ్లిన ఆమె తల్లిదండ్రులు రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటికి వచ్చారు. ఎంత పిలిచినా కుమార్తె తలుపులు తెరవకపోవడంతో బలవంతంగా తెరిచారు. కుమార్తె లోపల ఉరి వేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. గోపాలపట్నం పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, ఆత్మహత్యకు కారణాలపై వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పద్మనాభంలో సీజీఆర్ఎఫ్ సమావేశం రేపు

సీతమ్మధార, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి పద్మనాభం సెక్షన్‌లో గురువారం సమావేశం నిర్వహించనున్నట్టు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్, విశ్రాంత జడ్జి బి. సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పద్మనాభం సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే ఈ సమావేశంలో వినియోగదారులు నేరుగా పాల్గొని సమస్యలపై ఫిర్యాదులు తెలియజేయవచ్చన్నారు.

ముగిసిన బిమ్స్ టెక్ సదస్సు



మాట్లాడుతున్న కేంద్ర కార్యదర్శి రామచంద్రన్

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో బిమ్స్ టెక్-2025 సదస్సు మంగళవారంతో ముగిసింది. రెండో రోజు ప్రాంతీయ వాణిజ్యం, క్రూయిజ్ టూరిజం, నౌకా నిర్మాణ రంగాల అభివృద్ధిపై చర్చించారు. ఈ సదస్సుకు బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయ్‌ల్యాండ్ దేశాల నుంచి పోర్టుల ప్రతినిధులు, సముద్ర రవాణా వ్యాపారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రాంతీయ వాణిజ్యం ప్రస్తుతం ఏడు శాతమే ఉందని, దీనిని భారీగా పెంచడానికి కస్టమ్స్ విధానాలను సరళీకృతం చేయాలని పలువురు సూచించారు. లాజిస్టిక్స్ రంగంలో మౌలిక సదుపాయాల కొరత ఎక్కువగా ఉందని, మరిన్ని వసతులు అవసరమని అభిప్రాయపడ్డారు. క్రూయిజ్ టూరిజం అభివృద్ధికి సముద్ర తీరాల జీవ వైవిధ్యం, సాంస్కృతిక వారసత్వం, పర్యాటక ఆధ్యాత్మిక కేంద్రాలు దోహదపడతాయని వాటిని గుర్తించి అభివృద్ధి చేయాల్సి ఉందని ఏకాభిప్రాయం వ్యక్తంచేశారు. ముగింపు సమావేశంలో కేంద్ర పోర్టులు, జల రవాణా శాఖ సెక్రటరీ రామచంద్రన్ మాట్లాడుతూ పోర్టులు, షిప్‌యార్డుల అభివృద్ధికి పీపీపీ విధానం అనుసరించాల్సి ఉంటుందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కృషి జరగాలన్నారు. ఇదిలావుండగా మంగళవారం కేంద్ర పోర్టులు, జల రవాణా శాఖా మంత్రి శర్బానంద సోనోవాల్ హిందూస్థాన్ షిప్‌యార్డ్‌ను సందర్శించారు. ఆ తరువాత డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పనితీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు, డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్ కుమార్ దూబే, పాల్గొన్నారు.

నగరంలో కిడ్నీ రాకెట్?

... 3వ పేజీ తరువాయి

లాగినట్టు సమాచారం. ఈ రాకెట్‌లో ప్రమేయం కలిగిన వారిని గుట్టుగా స్టేషన్‌కు పిలిచి వారి నుంచి భారీగా గుంజేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం పోలీస్ శాఖలోని నిఘా విభాగంలో పనిచేస్తున్న ఒక కానిస్టేబుల్‌కు తెలిసింది. తన పైఅధికారికి సమాచారం ఇస్తే ఇందులో ప్రమేయం ఉన్న ఒకరితో సదరు అధికారికి సన్నిహిత సంబంధాలు ఉండడంతో ఉన్నతాధికారి దృష్టికి వెళ్లకుండా తొక్కిపెట్టేస్తారని భావించారు. దీంతో తమ విభాగానికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో సమాచారాన్ని పోస్ట్ చేశారు. దీంతో విషయం నేరుగా సీపీకి చేరడంతో స్టేషన్ అధికారులు ఆగమేఘాల మీద ఈనెల 13న రాత్రి తొమ్మిది గంటల సమయంలో వాట్సాప్‌లో ఒక పోస్ట్ పెట్టి సమాచారాన్ని బయటకు వెల్లడించారు. హోటల్‌లో కిడ్నీల విక్రయం గురించి ఇద్దరు మాట్లాడుకుంటున్నట్టు సిబ్బంది ఇచ్చిన సమాచారంతో వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించి, మందలించి పంపించేశామన్నది వాట్సాప్‌లో పెట్టిన మెసేజ్ సారాంశం. అదే నిజమైతే గత నెల 30న జరిగిన ఘటనకు 15 రోజులు ఎందుకు దాచిపెట్టారనేది అర్థం కానిప్రశ్నగా మారింది. అసలు వైద్యుడుగానీ ఎవరూలేరని, కేవలం ఇద్దరు వ్యక్తులే హోటల్‌లో ఉన్నారని చెబుతున్న పోలీసులు మంగళవారం కూడా హోటల్‌కు వెళ్లి దర్యాప్తు చేశారు. దీనిపై ఫోర్త్‌టౌన్ సీఐ సత్యనారాయణను వివరణ కోరగా ఆరోపణలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఈ ఉదంతంలో ఎవరినీ అరెస్టు చేయలేదని, గతంలో జరిగిన కిడ్నీ రాకెట్ కేసుల్లో నిందితులతో వీరికి ఏమైనా సంబంధాలు ఉన్నాయా?, వైద్యులు ఎవరైనా ఉన్నారా? అనేదానిపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. పట్టుబడిన వ్యక్తుల కాల్‌డేటా రాగానే వారి వెనుక ఉన్నవారి వివరాలు తెలుస్తాయని, ఈ కేసులో ఉన్నతాధికారుల పర్యవేక్షణలోనే దర్యాప్తు జరుగుతోంది కాబట్టి అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేదని స్పష్టంచేశారు.

మహా మాయ

... 3వ పేజీ తరువాయి

చెబుతున్నారు. ఒకవేళ వర్క్ డీవియేషన్‌కు వెళ్లాలనుకుంటే ముందస్తు ఆమోదం తీసుకోవడంతోపాటు టెండర్ పిలిచిన వర్కు స్వభావానికి తగిన పనికే ఆ మొత్తాన్ని సర్దుబాటు చేయాల్సి ఉంటుంది తప్పితే, ఫౌంటెయిన్ కోసం మంజూరుచేసిన గ్రాంటును ప్రహరీకి ఖర్చు చేయడానికి వీల్లేదని అంటున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో పెద్దఎత్తున అవినీతి జరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా పనులు జరిగినట్టు రికార్డులో చూపించిన అధికారులు ఎవరు?, వాటిని గుడ్డిగా ధ్రువీకరించి బిల్లుకు సిఫారసు చేసింది ఎవరు?...ఎవరి పాత్ర ఎంత?...అనేది ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి నిగ్గుతేల్చాల్సిన అవసరం ఉంది.

వర్షాకాలంలో 7,00,000 మొక్కలు పంపిణీ

... 3వ పేజీ తరువాయి

సిద్ధం చేశారు. స్వచ్ఛంద సంస్థలకు కూడా మొక్కలు అందజేయాలని నిర్ణయించారు. కాగా జిల్లాలో ఈ ఏడాది పది లక్షల మొక్కలు నాటాలని అధికార యంత్రాంగం లక్ష్యంగా నిర్ణయించింది. ఈమొత్తం అటవీ శాఖ పరిధిలోని నర్సరీలు, ప్రైవేటు నర్సరీల నుంచి సమీకరించాలని అధికారులు నిర్ణయించారు.


శాకంబరి అలంకరణలో అమ్మవారు

చినపోలమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు

మద్దిలపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): శివాజీపాలెంలోని చినపోలమాంబ అమ్మవారు ఆషాఢమాస పూజల్లో భాగంగా మంగళవారం శాకంబరిదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. శివాజీపార్కు రోడ్డులోని వేపచెట్టు పైడితల్లి అమ్మవారి ఆలయంలో కూడా భక్తులు పూజలు జరిపారు. వీటిని ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

దృష్టిలోపంపై అవగాహన అవసరం

ఆరిలోవ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో వేగంగా పెరుగుతున్న మయోపియా కంటివ్యాధి పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అవగాహన అవసరమని ఎల్వీప్రసాద్ నేత్రవైద్యశాల బృందం పేర్కొంది. ఈ వ్యాధిపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మయోపియా నిపుణురాలు ఎ.కౌసల్య మాట్లాడుతూ ఈ వ్యాధి పోకిన పిల్లలు దగ్గరగా ఉండే వస్తువులను చక్కగా చూడగలరు. దూరపు వస్తువులు అస్పష్టంగా కనిపిస్తాయి. ఉపాధ్యాయులు బోర్డుపై రాసినవి కొందరు పిల్లలు చూసి రాసుకోలేరు. ఇవి మయోపియా లక్షణాలని తెలిపారు. దృష్టిలోపం సమస్యలు తలెత్తినప్పుడు నిపుణులను సంప్రదించాలని ఆమె సూచించారు.

ఘనంగా కనకమ్మ మూరు వారం ఉత్సవం



వెంకోజీపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక 16వ వార్డులోని ఇసుకతోట జాతీయ రహదారి పక్కనున్న కనకదుర్గ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా మంగళవారం మారువారం ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా సీతారామ సేవా మండలి సభ్యులు అమ్మవారిని విశేషంగా అలంకరించారు. తెల్లవారు జాము నుంచి గ్రామంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులను సమర్పించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 20న ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్టు సంఘం అధ్యక్షుడు కోరిబిల్లి త్రినాథ్ శివ సత్యబాబు తెలిపారు. కార్యవర్గ ప్రతినిధులు మద్ది శశిభూషణరెడ్డి, సూరిశెట్టి అప్పలరాజు (బుజ్జి), సూరిశెట్టి సత్యనారాయణ, పెంటకోట రమేష్, రాపేటి గోవింద్‌రాజు, గ్రామస్థులు పెంటకోట చిన్నాబాబు, సూరిశెట్టి వెంకటేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 28, వంకాయలు (తెలుపు) 88, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 28, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 20,కాలీఫ్లవర్ 40, క్యాబేజి 21, క్యారెట్ 44, దొండకాయలు 32, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 52, అల్లం (పాతది) 48, బరబాటి 28, అగాకారకాయ 75, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 54, దేముడు చిక్కుడు 84, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర 4, పాల కూర 4, తోటకూర 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, ఎమ్మెల్సీ చిరంజీవిరావు

పెదవాల్తేరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత క్రమ పద్ధతిలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తూర్పు నియోజకవర్గం శాసన సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరు తదితర ప్రాంతాల్లో మంగళవారం 'సుపరిపాలనకు తొలిఅడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడితో పాటు ఎమ్మెల్సీ వి.చిరంజీవిరావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి తదితరులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి పాలనపై ప్రజల్లో స్పందన వచ్చిందన్నారు. ఎన్నికల మందు తాము ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయడంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట తప్పడం లేదన్నారు. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, సామాజిక పింఛన్లు తదితర పథకాలను పక్కాగా అమలు చేస్తున్నారని తెలిపారు. వచ్చే నెల నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు కానున్నట్లు చెప్పారు. స్థానిక సమస్యలపై కొందరు ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కళ్ళ శంకర్, మద్ది శ్రీను, సీహెచ్ జ్యోతి, కంభాపు శివారెడ్డి, వాసు, సురేష్, గోవింద్, సూర్యనారాయణ, నరేంద్ర, ఒమ్మి అప్పారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య పర్యవేక్షణ పక్కాగా జరగాలి

ప్రజారోగ్య విభాగంపై సమీక్షలో జీవీఎంసీ కమిషనర్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల పనితీరును నిశితంగా పరిశీలించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. మంగళవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి ఈఎన్‌వీ నరేష్ కుమార్, ఏఎంఓహెచ్‌లు, ఇతర ప్రజారోగ్య అధికారులు, మెకానికల్, తాగునీటి విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య విభాగం అధికారులు రోజూ ఉదయం క్షేత్రస్థాయిలో పారిశుధ్య కార్మికుల పనితీరును పరిశీలించాలని ఆదేశించారు. ఉదయాన్నే పనులను పరిశీలిస్తే రాత్రి విధుల్లో ఉండే కార్మికుల పనితీరు తెలుస్తుందన్నారు. అధికారుల పర్యవేక్షణలో ప్రతి క్లాప్ వాహనం ఇంటింటికీ వెళ్లి రూట్ మ్యాప్ ప్రకారం మూడు ట్రిప్పులు చెత్త సేకరిస్తే శత శాతం పూర్తవుతుందన్నారు. శానిటరీ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు చెత్త పడే ప్రదేశాలను గుర్తించాలని, కంపాక్టర్ బిన్‌లు అప్పుడప్పుడు ప్రదేశాలు మార్చుతూ ఉండాలన్నారు. అధికారులు వారంలో ఒక్కరోజు పారిశుధ్య కార్మికులతో చర్చిస్తే లోపాలను సరిదిద్దవచ్చని తెలిపారు. చాలాచోట్ల పారిశుధ్య కార్మికులు రోడ్లను తుడిచి కాలువలోకి నెట్టేస్తున్నారని, అలా చేయకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్మికులను సర్దుబాటు చేసి పనులు జరిగేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. కాలువలపై ఆక్రమణలు గుర్తించి నివేదిక సమర్పించాలన్నారు. వాణిజ్య సముదాయాల ముందు వ్యర్థాలు ఉంటే ఆ దుకాణదారుడి నుంచి అపరాధరుసుం వసూలు చేయాలని ఆదేశించారు. నగరంలో దోమలు వృద్ధి చెందకుండా అవగాహన కార్యక్రమాలు సరిగా నిర్వహించడం లేదని జీవీఎంసీ బయాలజిస్టు సాంబమూర్తిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పొగ, పిచికారీతో పాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని ఆదేశించారు. మురుగు కాలువల క్రాసింగ్ వద్ద తాగునీటి పైపులు కలుషితం కాకుండా ఎమినిటీస్ కార్యదర్శులు, జీవీఎంసీ తాగునీటి విభాగం సహాయక ఇంజనీర్లు పరిశీలించి వెంటనే సరి చేయాలని, ప్రజలకు అందించే తాగునీటి పైపులైన్లు లీకులు లేకుండా అరికట్టాలని, రోజూ నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించిన అనంతరమే తాగునీటిని ప్రజలకు అందించాలన్నారు. స్వీపింగ్ యంత్రాల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని జీవీఎంసీ మెకానికల్ ఇంజనీర్ విభాగం అధికారులను ఆదేశించారు. జీవీఎంసీలో మెరుగైన సేవలు చేసినవారికి త్వరలో ర్యాంకులు, అవార్డులను వార్డు, జోనల్ స్థాయిలో అందిస్తామని కమిషనర్ వెల్లడించారు. సమీక్షలో వివిధ స్థాయిల అధికారులు పాల్గొన్నారు.

ఇదేమి చోద్యమో!

- ఓ వృద్ధురాలి దుకాణం తొలగింపునకు ఒత్తిడి
- కోర్టు ఆదేశాలున్నా లెక్కచేయని వైనం
- సచివాలయ సిబ్బంది వింత ప్రవర్తన


డ్రైనేజీ నిర్మాణానికి తవ్విన రోడ్డులో చేరిన మురుగు


దుకాణం తొలగించాలని చెబుతున్న సచివాలయ కార్యదర్శి

మద్దిలపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 22వ వార్డులో సచివాలయ సిబ్బంది అతి చేస్తున్నారు. చట్టాలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్నారు. నిబంధనలు పాటించకుండా రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా ప్రవర్తిస్తున్నారు. పిఠాపురంకాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మంగాపురంకాలనీలో ఎన్టీఆర్ విగ్రహం నుంచి పిఠాపురంకాలనీ బజార్ వరకు సుమారు 300 మీటర్ల నూతన డ్రైనేజీని నిర్మిస్తున్నారు. అయితే బజార్ ఎదురుగా వాంబే గృహ సముదాయానికి ఆనుకుని దుకాణం ఉంది. ఓ వృద్ధురాలు ఇక్కడ దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తుంది. ఆమె దుకాణం నిర్వహించుకోవడానికి 2018లో జిల్లా కోర్టు పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. అప్పటి జీవీఎంసీ కమిషనర్ సైతం దుకాణం తొలగించబోమని ఆర్డర్ కాపీ ఇచ్చారు. అయితే స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ దుకాణం తొలగించాలని సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. దుకాణం తొలగిస్తే కాని డ్రైనేజీ పనులు చేపట్టకూడదని హుకుం జారీ చేశారు. దీంతో డ్రైనేజీ కోసం తీసిన గోతుల్లో బురద నీరు చేరి అధ్వానంగా మారింది. దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా రోడ్డు తవ్వేయడంతో వాహన రాకపోకలకు వీలుపడడం లేదు. నడిచే దారి లేకపోవడంతో స్థానికులు ఇళ్ల నుంచి రాలేని పరిస్థితి వచ్చింది. స్థానికులు ఇబ్బంది పడుతున్నా డ్రైనేజీ నిర్మాణం చేపట్టడం లేదు. మంగళవారం కూడా కార్పొరేటర్, సచివాలయ సిబ్బంది వచ్చి కోర్టు ఆదేశాలు ఉన్నందున తాము దుకాణం తొలగించకూడదని, మీరే స్వయంగా తొలగించుకోవాలని వింతవాదన చేయడంతో స్థానికులు అవాక్కయ్యారు. దుకాణం తొలగిస్తేనే డ్రైనేజీ నిర్మిస్తామని స్పష్టం చేస్తూ సిబ్బంది, కార్పొరేటర్ అక్కడ నుంచి వెనుదిరిగారు. వాస్తవానికి డ్రైనేజీ నిర్మాణానికి దుకాణం ఏమాత్రం అడ్డుగా లేదు. ముందుకున్న అపార్ట్‌మెంట్‌ల వద్ద డ్రైనేజీ నిర్మించి, దుకాణం వద్దే పనులు నిలిపివేయడాన్ని స్థానికులు విమర్శిస్తున్నారు.

షిప్‌యార్డును సందర్శించిన కేంద్ర మంత్రి


కేంద్రమంత్రికి షిప్‌యార్డు చిత్రపటాన్ని చూపిస్తున్న అధికారులు

మల్కాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)ను కేంద్ర మంత్రి సర్బనందా సోనోవాల్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ సీఎండీ హేమంత్ ఖత్రీ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం సంస్థలో పలు విభాగాలను వాటి పనితీరు గురించి ఆయనకు వివరించారు. అలాగే సంస్థలో పలు ఆర్డర్లు, నౌక నిర్మాణాలు, మరమ్మతులు తదితర అంశాల గురించి వివరించారు. ముఖ్యంగా ఫోకస్ ప్రాంతాలలో గ్రీన్ ట్యాగ్స్, హైడ్రోజన్ ఇంధన సెల్-శక్తితో కూడిన నౌకాలు గురించి తెలిపారు. ప్లాట్‌ఫాంలు నౌకాలను నిర్మించడానికి సిద్ధంగా ఉన్నాయని తెలియజేశారు. భవిష్యత్‌లో దేశం సముద్ర సామర్థ్యాలను బలోపేతం చేయడానికి హెచ్‌ఎస్‌ఎల్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం అథారిటీ (వీపీఏ) చైర్మన్ డాక్టర్ మాధయ్యాన్ అంగముతు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకంగా విశాఖ మరింత అభివృద్ధి

సినీ నటుడు సమీర్


మాట్లాడుతున్న సినీ నటుడు సమీర్

ఎంవీపీ కాలనీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి పాలనలో విశాఖ పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని ప్రముఖ సినీ నటుడు సమీర్ అన్నారు. ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం సాయంత్రం గాదిరాజు ప్యాలెస్‌లో ఈమా లైమ్ లైట్ అవార్డుల వేడుక కన్నుల పండువగా నిర్వహించనున్నట్టు తెలిపారు. వైజాగ్ ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పలు రంగాలకు చెందిన నిపుణులకు అవార్డులు అందిస్తామని చెప్పారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సందీప్‌కుమార్, షరీఫ్‌ఖాన్ మాట్లాడుతూ ప్రభతిభావంతులైన యాంకర్లు, సింగర్లు, డాన్సర్స్, సౌండ్, లైటింగ్, ఎల్‌ఈడీ టెక్నిషియన్లు, ఈవదెంటత్ ఇండస్ట్రీలో దిగ్గజాలకు అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే ముంబై, కోల్‌కత్తా, బెంగళూరు, డిల్లీ నుంచి సెలబ్రిటీ కళాకారుల ప్రదర్శనలు ఉన్నాయని పేర్కొన్నారు. సమావేశంలో గాదిరాజు ప్యాలెస్ జీఎం మధు, ఈమా కార్యవర్గ సభ్యులు కామేష్, పాలూరి, సురేష్‌కుమార్, జీఎన్ రాజు, సంతోష్‌కుమార్, ఆండ్‌మోహన్, ఆశాపట్నాయక్, జగదీశ్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై నిర్మాణ సామగ్రి


ఫుట్‌పాత్‌పై వేసిన భవన నిర్మాణ సామగ్రి

ఆరిలోవ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో కేంద్ర కారాగారానికి సమీపంలో ఉన్న రామకృష్ణాపురం ఫుట్‌పాత్‌లపై కొందరు భవన నిర్మాణదారులు పిక్క, ఇసుక వంటి సామగ్రిని అమ్మకానికి వేస్తున్నారు. దీనివల్ల అటుగా రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారి అధికార పార్టీకి చెందిన వారు కావడంతో అధికారులు కిమ్మనడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ అధికారులు ఈ విషయమై పట్టించుకోకపోవడంతో స్థానికులు మండిపడుతున్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ఎంవీపీ కాలనీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఎస్సీ, ఎస్టీ, ఆఫీసర్స్, ఎంప్లాయీస్ అసోసియేషన్ సంయుక్తంగా ఎంవీపీ కాలనీలోని ఎస్టీ బాలికల వసతి గృహం విద్యార్థినులకు మంగళవారం వెయ్యి నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దేవీశ్వరరావు, ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రామలింగం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు నీరు


హెచ్‌బీ కాలనీ ప్రధాన రహదారిలో ప్రవహిస్తున్న మురుగు నీరు

వెంకోజీపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధార నుంచి వెంకోజీపాలెం వరకు ఉన్న ప్రధాన రహదారిలో ఇరువైపులా మోడ్రన్ ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు. అయితే వీటిపై అక్కడక్కడ బడ్డీలు, దుకాణాల సామగ్రి వేసి ఫుట్‌పాత్‌లను కానరాకుండా చేస్తున్నారు. దీనికితోడు ఫుట్‌పాత్‌ల కిందనున్న మురుగునీటి కాలువలో నీరు సజావుగా సాగకుండా, అందులో చెత్తను తొలగించలేకుండా మేన్‌హోల్ వద్ద ఆక్రమణ ఉండడంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఆదివారం కురిసిన భారీ వర్షానికి చెత్తాచెదారం అంతా కాలువల్లో పేరుకుపోయి, మురుగు నీరు రోడ్డుపైకి వచ్చింది. దీంతో హెచ్‌బీకాలనీ మార్గమంతా మురుగు నీరుతో అధ్వానంగా తయారైంది. స్టీల్ ప్లాంట్ మెయింటెనెన్స్ కార్యాలయం వద్ద మురుగు పేరుకుపోవడంతో ఈ ప్రాంతంలో వాహనాలు వెళ్లడానికి వీలులేకుండా అయిపోంది. పాదచారులైతే నడిచేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రామకృష్ణాపురంలో భవన నిర్మాణ వ్యర్థాలతో కప్పుతున్న చెరువు

అక్రమ భవన నిర్మాణాలకు చెరువు పూడ్చివేత

ఆరిలోవ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులోని రామకృష్ణాపురం అక్రమ నిర్మాణాలకు నిలయమైంది. ఇక్కడున్న క్వారీ చెరువును కప్పి స్థానిక నాయకులు ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. దీన్ని అడ్డుకోవలసిన సచివాలయం సిబ్బంది పట్టించుకోవడం లేదు. స్థానిక నాయకుడు వారిని 'మేనేజ్' చేస్తున్నట్లు వినికిడి. ఇటీవల విద్యుత్ లైన్ల కోసం రోడ్డును తవ్విన మెటీరియల్‌ను తీసుకొచ్చి ఇక్కడ గోతులు కప్పి ప్లాట్లుగా చేస్తున్నారు. ఇదే విధంగా కొనసాగితే కొంతకాలానికి చెరువు చిరునామా గల్లంతవుతుందని స్థానికులు గుసగుసలాడుతున్నారు. ఈ ప్రాంతంలో ఇలాంటి స్థలాల దందాకు స్థానిక టీడీపీ నాయకులు అండగా ఉంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు సందర్శించి అక్రమ బాగోతాన్ని అడ్డుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా దారపాలెం బంగారమ్మ ఉత్సవాలు

ఆరిలోవ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధికి చెందిన 13వ వార్డు దారపాలెంలో వెలసిన పుట్ట బంగారమ్మ ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. పురాతన గ్రామ దేవత బంగారమ్మ పుట్టకు పూజలు చేయడం ఇక్కడ ప్రత్యేకత. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పలు నేలవేషాలు, తప్పెటగుళ్ళు, ఘటాలతో అమ్మవారిమూర్తులను ఊరేగించారు. ఈ సందర్భంగా కాల్చిన బాణసంచా ఆకట్టుకుంది.

మహిళలకు ఆదర్శం దుర్గాబాయ్ దేశ్‌ముఖ్


మాట్లాడుతున్న ఆచార్య ఎ.నరసింహారావు

వెంకోజీపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధురాలు, సంఘ సంస్కర్త దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళలకు ఆదర్శమని ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. ఏయూ డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో దుర్గాబాయి జయంతి పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని ఆ సెంటర్ డైరెక్టర్ ఆచార్య ఎ.పల్లవి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ చిత్రపటానికి నివాళులర్పించారు. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఏయూలో పొలిటికల్ సైన్స్‌లో పీజీ చేశారని, ఇక్కడ ఆమె చదవడం వర్సిటీకి గర్వకారణమన్నారు. భారతదేశ ప్రణాళికా సంఘ సభ్యురాలిగా ఆమె సామాజిక సేవలో ముందుండేవారని చెప్పారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్‌కి మొదటి చైర్‌పర్సన్‌గా వ్యవహరించారన్నారు. ఈ సందర్భంగా వ్యాస రచన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.పద్మశ్రీ, ఐఎఎస్ఈ ఇంచార్జి ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజకుమారి, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం హెడ్ ఆచార్య పేటేటి ప్రేమానందం, లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సైన్స్ హెడ్ డాక్టర్ వి.ధనరాజ్, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎ.పల్లవి, సెంటర్ సిబ్బంది, వివిధ విభాగాల విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు


కార్యక్రమంలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

సిరిపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, రాష్ట్రంలో ఏదో ఒక చోట మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసి ప్లకార్డులు పట్టుకుని కూటమి ప్రభుత్వంలో ఆడబిడ్డలకు రక్షణ లేదని 'బాబు వచ్చాడు..దిశ పోయిందంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రోజుకో ప్రాంతంలో మహిళలపై దాడులు జరుగుతున్నాయన్నారు. మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి మాట్లాడుతూ కృష్ణా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ గూండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళ అని చూడకుండా సభ్యసమాజం తలదించుకునేలా దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. పోలీసుల సమక్షంలో దాడులు చేస్తుంటే డీజీపీ, హోంమంత్రి అనిత ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త మొల్లి అప్పారావు, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, నాయకులు రవిరెడ్డి, జాన్‌వెస్లీ, బానాల శ్రీనివాసరావు, చిన్నతల్లి, సతీష్‌వర్మ, శ్రీవాత్సవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాక్సింగ్ చాంపియన్లకు అభినందనలు


బాక్సింగ్ చాంపియన్‌లను అభినందిస్తున్న ఒమ్మి అప్పలరాజు

ఆరిలోవ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆరిలోవ ప్రాంతానికి చెందిన ముగ్గురు బాలికలు బంగారు పతకాలు సాధించడం ఆనంద దాయకమని 13వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు అన్నారు. ఇటీవల రైల్వే స్టేడియంలో జరిగిన సబ్ జూనియర్ విభాగంలో ఆరిలోవకు చెందిన పి.కుందన సోమశ్రీతో పాటు మరో ఇద్దరు వచ్చే నెలలో జరగబోయే నేషనల్ బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించడం అభినందనీయమని అన్నారు. వీరికి కోచింగ్ ఇచ్చిన బంగార్రాజు, రామారావు, వాలిని ఆయన అభినందించారు.

పట్టపగలు వెలుగుతున్న వీధి లైట్లు

ఆరిలోవ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పెదగదిలిలోని సాలిపేట కొండవాలు ప్రాంతంలో వీధిలైట్లు రాత్రి, పగలు కూడా వెలుగుతున్నాయి. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. స్థానికులు ఫిర్యాదు చేసినా విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. పగలు లైట్లు వెలగడంతో అనవసరంగా విద్యుత్ దుబారా అవుతోందని పలువురు చెబుతున్నారు.

సాంస్కృతిక సేవకునికి సత్కారం



ఎంవీ రాజశేఖర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

మహారాణిపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): టౌన్ కొత్తరోడ్డులోని జగన్నాథస్వామి రథోత్సవాల్లో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ అందించిన పలు సాంస్కృతిక సేవలకు మెచ్చి నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఈవో టి.రాజగోపాలరెడ్డి, ఆలయ అర్చకులు రాజశేఖర్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం, ప్రశంసాపత్రం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రసాద్ శ్రీరామ్, శ్రీహరి, ఎన్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



అంబేద్కర్ విగ్రహం వద్ద చీరలు అందుకున్న మహిళలతో అధికారులు, ఉద్యోగులు

జ్ఞానాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎస్సీ ఎస్టీ ఆఫీసర్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ యాజమాన్యం సహకారంతో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. జ్ఞానాపురంలో 300 మంది మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉద్యమ స్ఫూర్తితో 'పే బ్యాక్ టు సొసైటీ' లక్ష్య సాధనలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. సంఘం సభ్యులు జి.ఉమామహేశ్వరరావు, ఎం.దేవీశ్వరరావు, ఎం.సత్యనారాయణ, ఈసర లక్ష్మి పాల్గొన్నారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫ్యాకల్టీ చైర్మన్‌గా ప్రొ.విజయ్‌మోహన్



విశాఖపట్నం స్పోర్ట్స్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ నియమితులయ్యారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్.ధనుంజయరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయ్‌మోహన్... రాష్ట్ర విశ్వవిద్యాలయాల చట్టం ప్రకారం అకడమిక్ సెనేట్ క్లాసు-1, ఎక్స్ అఫీషియో సభ్యునిగా మారనున్నారు. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరక్టర్‌గా, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్‌గా విజయవంతంగా పనిచేయడమే కాకుండా ప్రస్తుతం ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరక్టర్‌గా కొనసాగుతున్న విజయ్‌మోహన్....మరింత ఉన్నత స్థాయి పదవికి నియామకం కావడంపై ఏయూ ఆచార్యులు, డైరక్టర్లు, పరిశోధకులు హర్షం వ్యక్తం చేశారు.

విశాఖ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అప్రెంటిస్‌షిప్ మేళా

డాబాగార్డెన్స్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పాత జైల్‌రోడ్డులోని విశాఖ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఇంటర్ అప్రెంటిస్‌షిప్ మేళాకు మంచి స్పందన లభించిందని ప్రిన్సిపాల్ జె.విజయ తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మేళాకు సుమారు 213 మంది ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యు, ఓఏఎస్, పీటీ, ఇంటర్ పూర్తయిన ఒకేషనల్ విద్యార్థులు హాజరైనట్టు జిల్లా వృత్తి విద్యాధికారి ఎం.ఆదినారాయణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు త్వరలో సమాచారం పంపిస్తామని స్టీల్‌ప్లాంట్ మేనేజర్ తెలియజేశారని చెప్పారు.

18న గురుదత్ ప్యాసా హిందీ సినిమా ఉచిత ప్రదర్శన

డాబాగార్డెన్స్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 18న ప్యాసా హిందీ సినిమాను ఉచితంగా ప్రదర్శించనున్నట్టు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. నటుడిగా, దర్శకత్వం వహించిన ప్యాసా సినిమా క్లాసికల్ చిత్రంగా నిలిచిందన్నారు. ఆయన గొప్పతనాన్ని ప్రస్తుత తరం సినీప్రియులకు తెలియాలనే ఉద్దేశంతో విశాఖ పౌరగ్రంథాలయంలో సాయంత్రం 5.30 గంటలకు ఉచితంగా చిత్రాన్ని ప్రదర్శిస్తున్నామన్నారు. సినీప్రియులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కూటమి పాలనపై ప్రచారం



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

కంచరపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధి రెడ్డికంచరపాలెంలో టీడీపీ నాయకులు మంగళవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ ఆదేశాల మేరకు వార్డు పరిధి 19, 20 బూత్‌ల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఆయా బూత్‌ల్లో స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ ఎస్.అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బండి రంజీత్, యమున, వెంకటరావు, రమణా రెడ్డి, కోటి, గాంధీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ నరికిన కొమ్మలు అక్కడే..!

» ఈపీడీసీఎల్ నిర్వాకంతో ప్రజలకు అవస్థలు



మాధవధార తెన్నేటినగర్‌లో రోడ్డంతా చెట్ల వ్యర్థాలు.

మురళీనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగల నిర్వహణ కోసం ఈపీడీసీఎల్ తొలగించే కొమ్మలు, చెట్ల వ్యర్థాలు రోడ్డంతా పేరుకుపోతున్నాయి. నెలలో నాలుగైదు రోజులు నిత్యం ఏదో ఫీడర్ పరిధిలో సరఫరా నిలిపివేసి కొమ్మలు వైర్లను తాకకుండా తొలగించడం ఏళ్లగా చేస్తున్న పనే. అయినా ఆ పని ముగిశాక వ్యర్థాల తరలింపు సమస్యగానే మిగిలిపోతోంది. జీవీఎంసీ కొంతమేర బాధ్యత తీసుకోవడం, లేదంటే వారు కాదన్న చోట్ల ఈపీడీసీఎల్ వాహనాలు పంపి వ్యర్థాలు తరలించడం చేస్తున్నారు. వర్షాలే కరువైన ఈ కాలంలోనూ నిర్వహణ పనులతో మురళీనగర్, మాధవధార రోడ్లన్నీ చెట్ల వ్యర్థాలతోనే దర్శనమిస్తున్నాయి. ఈ నెల 9న అత్యవసరంగా సింహాచల గిరి ప్రదక్షిణ ఏర్పాట్లలో భాగంగా కొట్టేసిన చెట్ల కొమ్మలను ఇప్పటికీ తరలించలేదు. మాధవధార గాయత్రి స్కూల్ రోడ్డు, తెన్నేటినగర్, మురళీనగర్ సబ్ స్టేషన్ పరిధిలోని హరిత జీవీఎంసీ పార్కు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు దారికి అడ్డంగా దర్శనమిస్తున్నాయి. పార్కుకు వచ్చే వారు వాహనాలు పార్కింగ్ చేసే జాగా మొత్తం చెట్ల వ్యర్థాలతో నిండిపోయింది. మురళీనగర్ సబ్‌స్టేషన్‌లో నెలలుగా సహాయక ఇంజనీరు పోస్టు ఖాళీగా ఉంది. జూనియరు ఇంజనీరే ఇక్కడ నిర్వహణ పనుల్ని ఇంచార్జి హోదాలో చూస్తున్నారు. దీంతో ఎక్కడ నరికిన కొమ్మలు అక్కడే రోజులు, నెలల తరబడి కన్పిస్తున్నాయి. విస్తీర్ణం పరంగా పెద్దదిగా ఉండే మాధవధార ఎస్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలోనూ వ్యర్థాల తరలింపు సక్రమంగా సాగడం లేదు. జీవీఎంసీ, ఈపీడీసీఎల్ విభాగాల సమన్వయంతో సమస్యను పరిష్కరించి పాదచారులు, వాహనాలకు రోడ్లు ఉపయోగపడేలా చూడాలని ఈ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

సీతమ్మధార, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బాధ్యతారహితంగా చేపట్టిన పనులు ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్నాయి. నక్కవానిపాలెం ఏఎంజీ రోడ్డులో కొద్ది రోజుల క్రితం ప్రమాదభరితంగా ఉన్న చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు. అయితే ఆ కొమ్మలను నరికిన చోటనే వదిలేశారు. దీంతో అవి రోడ్డుపై అడ్డంగా ఉన్నాయి. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నరికిన కొమ్మలు ఎండిపోవడంతో అగ్ని ప్రమాదానికీ అవకాశం ఉంది. తక్షణమే రహదారిపై అడ్డంగా ఉన్న కొమ్మలను తొలగించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రైల్వే జోన్ ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలి

ఎంపీ శ్రీభరత్‌ను కోరిన దక్షిణ కోస్తారైల్వే మజ్దూర్ యూనియన్



ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేయడానికి వచ్చిన చలసాని గాంధీ, మజ్దూర్ యూనియన్ నాయకులు

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జోన్ పూర్తిస్థాయిలో ఏర్పాటుకు అవసరమైన కీలక గెజిట్ నోటిఫికేషన్ వెంటనే జారీ చేయించాలని కోరుతూ దక్షిణ కోస్తారైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు మంగళవారం విశాఖ పార్లమెంటు సభ్యుడు శ్రీభరత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రైల్వే జోన్ కార్యకలాపాలను ప్రారంభించడంలో జాప్యం జరుగుతోందని, ఆగస్టు 15 నాటికి గెజిట్ నోటిఫికేషన్ జారీ అయ్యేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అభ్యర్థించారు. దీనిపై ఎంపీ శ్రీభరత్ స్పందిస్తూ...గెజిట్ నోటిఫికేషన్ జారీ అంశాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్‌ల దృష్టికి తీసుకువెళ్లి, జోన్ కార్యకలాపాలు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎంపీకి వినతిపత్రం అందజేసినవారిలో డీఆర్‌యూసీసీ సభ్యుడు చలసాని గాంధీ, దక్షిణ కోస్తా రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకరరావు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పద్మావతి



పద్మావతికి నియామక పత్రం అందిస్తున్న ఆర్. కృష్ణయ్య

సీతమ్మధార, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం 24వ వార్డు నక్కవానిపాలెంలో నివాసం ఉంటున్న తొత్తడి పద్మావతి జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఇంచార్జ్ యలగాల నూకానమ్మల నుంచి ఆమె నియామక పత్రాన్ని అందుకున్నారు. ఆర్.కృష్ణయ్య ఆమెకు కండువా కప్పి బీసీ ఉద్యమంలోకి ఆహ్వానించారు. బీసీల హక్కుల పరిరక్షణ, వారికి రాజ్యాధికారం దక్కేవరకు ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలని సూచించగా, పద్మావతి ఆయనకు హామీ ఇచ్చారు.

బి.సి. సంక్షేమ సంఘం సేవా కార్యక్రమాలు

మహారాణిపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బి.సి. సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అనాథలకు అన్నదానం చేశారు. అనంతరం వారికి మిఠాయిలు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ బి.సి. సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర జేఏసీ కన్వీనర్ గొర్లె శ్రీనివాసనాయుడుల నాయకత్వంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వన్‌టౌన్ తదితర ప్రాంతాల్లోని పలు అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, ప్రేమసమాజం తదితర చోట్ల అన్నదాన కార్యక్రమం చేపట్టారు. బి.సి. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు కామన వెంకట సుబ్బారావు, పల్లా రమణ యాదవ్, కార్యదర్శి శివప్రసాద్, సుభాష్ చంద్రబోస్, ఉపాధ్యక్షులు శేషగిరిరావు, హేమంత్, లోగిస గణేషు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో వ్యాధి నిరోధకశక్తి పెంపొందించాలి

» తల్లిదండ్రులకు శిశువైద్య నిపుణుడు డాక్టర్ శేషగిరి సూచన

మహారాణిపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): టీకా ద్వారా నివారించగల వ్యాధులపై మనదేశం చేస్తున్న పోరాటంలో విజయం సాధించేందుకు పాఠశాల వయస్సులో అందించే బూస్టర్ డోస్ టీకా చాలా కీలకమని ప్రముఖ నవజాత శిశు వైద్య నిపుణుడు డాక్టర్ కె.శేషగిరి అన్నారు. మంగళవారం లోటస్ ఆసుపత్రి సముదాయంలో ఇండియన్ నేషనల్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించటం, వ్యాధుల నుంచి రక్షణకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శేషగిరి మాట్లాడుతూ ఆరోగ్యానికి రక్షణగా రోగ నిరోధక శక్తి పెంపొందించటానికి బాల్యంలో అందించే టీకాలు పునాది అని పేర్కొన్నారు. నాలుగు నుంచి ఆరు సంవత్సరాల మధ్య బూస్టర్ డోస్ టీకా అందిస్తే మరింత రక్షణగా ఉంటుందన్నారు. నాలుగు సంవత్సరాల వయస్సులో పిల్లల్లో యాంటీబాడీ స్థాయిలు గణనీయంగా తగ్గుతాయని, ముఖ్యంగా పాఠశాల పరిసరాల్లో ఎక్కువ మంది పిల్లలను కలవటం ద్వారా ఈ సమస్య మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఇది తీవ్ర అనారోగ్యానికి దారితీయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అందువల్ల పిల్లలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించటానికి టీకా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలువురు వైద్యులు, పిల్లల తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ సవరణ ఉత్తర్వు రద్దుకు డిమాండ్

మహారాణిపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెన్షన్ సవరణ ఉత్తర్వును రద్దు చేయాలని విశాఖ జిల్లా పెన్షనర్ల సంఘం డిమాండ్ చేసింది. జిల్లా పరిషత్ కూడలిలోని పెన్షనర్ల సంఘ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సవరణ ఉత్తర్వు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు నష్టపోతారని, అందువల్ల కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, పే కమీషన్‌లను నియమించాలని డిమాండ్ చేశారు. పే కమీషన్‌లలో జాప్యం జరుగుతున్నందున మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని సూచించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.ప్రసాదరావు, కృష్ణమూర్తి, టీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాన్సాస్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ రేపు

డాబాగార్డెన్స్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ ఆనందపురం, భీమిలి, పద్మనాభం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాన్సాస్ ట్రస్టు విజయనగరం వారు పూసపాటి ఆనంద గజపతిరాజు జయంతి వేడుకలను పురస్కరించుకుని స్కాలర్‌షిప్‌లు ప్రకటించినట్లు సమగ్ర శిక్షా అదనపు సమన్వయకర్త జోగ చంద్రశేఖర రావు తెలిపారు. 2024-25 వార్షిక పరీక్షలలో ఎక్కువ మార్కులు సాధించిన 50 మంది విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకం ఇవ్వనున్నట్టు తెలిపారు. గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతిరాజు విజయనగరంలో ఈ నెల 17న ఉదయం 9.30 గంటలకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తారని వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, ఏపీసీ డా.జోగ చంద్రశేఖరరావు, జీసీడీఓ జి.శ్రీదేవి అభినందనలు తెలియజేశారు.

'ఎంతకాలం మాకు ఈ వ్యథ'?



నక్కవానిపాలెం ఏఎంజీ ఆసుపత్రి వద్ద గెడ్డ కాలువలో పేరుకుపోయిన చెత్త

సీతమ్మధార, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో ఏఎంజీ ఆసుపత్రి వద్ద కల్వర్ట్‌కు గ్రేటింగ్‌లు లేకపోవడంతో పెద్ద ఎత్తున గెడ్డ కాలువలో చెత్త చేరుతోంది. దీంతో ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతుంది. నిత్యం గెడ్డ కాలువల్లో మురుగు నిలిచిపోవడంతో రోడ్డుపైకి మురుగు నీరు వస్తుంది. అక్కడ కల్వర్ట్ కిందగా ఉంది. ఆ రహదారిలో ఒక కల్వర్టర్ ఉండటంతో పాటు దాని కింద పైపులైను ఉండటంతో గెడ్డలోంచి చెత్త వెళ్లకుండా నిలిచిపోతోంది. పారిశుధ్య సిబ్బంది రోజూ గెడ్డలో చెత్త తొలగిస్తున్నప్పటికీ ఎప్పటికప్పుడు మళ్లీ చేరిపోతుంది. దీంతో దుర్గంధం వెదజల్లి ఆ ప్రాంతంలో దోమల వ్యాప్తితో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఆ ప్రాంతంలో కల్వర్టర్లు ఎత్తుగా కట్టి అక్కడ మరో రెండు గ్రేటింగ్‌లు (మ్యాన్‌హోల్స్) ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ సమస్యపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోంది. వర్షం పడితే ఆ రహదారి వర్షపునీరు, బురదతో నిండిపోతోంది. గెడ్డ కాలువలో మురుగు నీరు రోడ్డుపైకి ఎగదన్ని నిలిచిపోతుంది. ఈ సమస్య జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వర్షం పడితే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి వర్షాలు కురవక ముందే అక్కడ గ్రేటింగ్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఒడిశా కోళ్లను దిగుమతి చేయొద్దు

కలెక్టర్‌కు బ్రాయిలర్ అసోసియేషన్ ప్రతినిధుల వినతి

ఆనందపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రలోని కోళ్ల రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బ్రాయిలర్ అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర బ్రాయిలర్ అసోసియేషన్ (బ్యాగ్) అధ్యక్షుడు కొట్యాడ శ్రీను, మాజీ అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు మాట్లాడుతూ ఒడిశాలో బ్రాయిలర్ కోళ్లకు వైరస్ ఉందని, వైరస్ సోకిన కోళ్లను మన రాష్ట్రానికి దిగుమతి చేస్తే ఇక్కడ కూడా ఆ వైరస్ సోకే ప్రమాదం ఉందన్నారు. గతంలో కూడా ఇటువంటి సంఘటనలు జరిగి రైతులు చాలావరకు నష్టాలు చూడాల్సిన పరిస్థితి వచ్చిందని వివరించారు. ఒడిశా నుంచి వైరస్ సోకిన బ్రాయిలర్ కోళ్లను మన రాష్ట్రంలోకి రాకుండా నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరర్ ఎస్.మన్మథరావు, సీనియర్ ఫార్మర్ రౌతు రమణ, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.


పద్మనాభంలో సీజీఆర్ఎఫ్ సమావేశం రేపు

సీతమ్మధార, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ విశాఖపట్నం సర్కిల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం పద్మనాభం సెక్షన్‌లో గురువారం సదస్సు నిర్వహించనున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ తెలిపారు. పద్మనాభం సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే సమావేశంలో వినియోగదారులు పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చు, తగ్గులు, బిల్లుల సమస్య, కొత్త సర్వీసుల జారీ, సరఫరా పునరుద్ధరణలో జాప్యం, వినియోగదారుల పేరు, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులను తమ కమిటీకి తెలియజేయవచ్చున్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1912ను కూడా సంప్రదించవచ్చని సూచించారు.

27న గవర విద్యార్థులకు ప్రోత్సాహకాలు

అక్కయ్యపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థులకు తమ సంఘం (గవర) ఆధ్వర్యంలో ఈ నెల 27న బహుమతి ప్రదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ద శివాజీ తెలిపారు. రైల్వే న్యూకాలనీలోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన వారికి, పోటీపరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు కనబరచినవారికి ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. అర్హులు ఈ నెల 19లోగా సంఘం కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

పారిశుధ్య పర్యవేక్షణ పక్కాగా జరగాలి: కమిషనర్ కేతన్‌గార్గ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల పనితీరును నిశితంగా పరిశీలించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. మంగళవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి ఈఎన్‌వీ నరేష్ కుమార్, ఏఎంఓహెచ్‌లు, ఇతర ప్రజారోగ్య అధికారులు, మెకానికల్, తాగునీటి విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య విభాగం అధికారులు రోజూ ఉదయం క్షేత్రస్థాయిలో పారిశుధ్య కార్మికుల పనితీరును పరిశీలించాలని ఆదేశించారు. ఉదయాన్నే పనులను పరిశీలిస్తే రాత్రి విధుల్లో ఉండే కార్మికుల పనితీరు తెలుస్తుందన్నారు. అధికారుల పర్యవేక్షణలో ప్రతి క్లాప్ వాహనం ఇంటింటికీ వెళ్లి రూట్ మ్యాప్ ప్రకారం మూడు ట్రిప్పులు చెత్త సేకరిస్తే శత శాతం పూర్తవుతుందన్నారు. శానిటరీ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు చెత్త పడే ప్రదేశాలను గుర్తించాలని, కంపాక్టర్ బిన్‌లు అప్పుడప్పుడు ప్రదేశాలు మార్చుతూ ఉండాలన్నారు. అధికారులు వారంలో ఒక్కరోజు పారిశుధ్య కార్మికులతో చర్చిస్తే లోపాలను సరిదిద్దవచ్చని తెలిపారు. చాలాచోట్ల పారిశుధ్య కార్మికులు రోడ్లను తుడిచి కాలువలోకి నెట్టేస్తున్నారని, అలా చేయకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్మికులను సర్దుబాటు చేసి పనులు జరిగేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. కాలువలపై ఆక్రమణలు గుర్తించి నివేదిక సమర్పించాలన్నారు. సమీక్షలో వివిధ స్థాయిల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన బిమ్స్‌టెక్ సదస్సు

» ప్రాంతీయ వాణిజ్యం, క్రూయిజ్ టూరిజం, నౌకా నిర్మాణ రంగాల అభివృద్ధిపై చర్చ



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర కార్యదర్శి రామచంద్రన్

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో బిమ్స్ టెక్-2025 సదస్సు మంగళవారంతో ముగిసింది. రెండో రోజు ప్రాంతీయ వాణిజ్యం, క్రూయిజ్ టూరిజం, నౌకా నిర్మాణ రంగాల అభివృద్ధిపై చర్చించారు. ఈ సదస్సుకు బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయ్‌ల్యాండ్ దేశాల నుంచి పోర్టుల ప్రతినిధులు, సముద్ర రవాణా వ్యాపారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రాంతీయ వాణిజ్యం ప్రస్తుతం ఏడు శాతమే ఉందని, దీనిని భారీగా పెంచడానికి కస్టమ్స్ విధానాలను సరళీకృతం చేయాలని పలువురు సూచించారు. లాజిస్టిక్స్ రంగంలో మౌలిక సదుపాయాల కొరత ఎక్కువగా ఉందని, మరిన్ని వసతులు అవసరమని అభిప్రాయపడ్డారు. క్రూయిజ్ టూరిజం అభివృద్ధికి సముద్ర తీరాల జీవ వైవిధ్యం, సాంస్కృతిక వారసత్వం, పర్యాటక ఆధ్యాత్మిక కేంద్రాలు దోహదపడతాయని వాటిని గుర్తించి అభివృద్ధి చేయాల్సి ఉందని ఏకాభిప్రాయం వ్యక్తంచేశారు. ముగింపు సమావేశంలో కేంద్ర పోర్టులు, జల రవాణా శాఖ సెక్రటరీ రామచంద్రన్ మాట్లాడుతూ పోర్టులు, షిప్‌యార్డుల అభివృద్ధికి పీపీపీ విధానం అనుసరించాల్సి ఉంటుందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కృషి జరగాలన్నారు. ఇదిలావుండగా మంగళవారం కేంద్ర పోర్టులు, జల రవాణా శాఖా మంత్రి శర్బానంద సోనోవాల్ హిందూస్థాన్ షిప్‌యార్డ్‌ను సందర్శించారు. ఆ తరువాత డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పనితీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు, డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్ కుమార్ దూబే, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

» చదువుకునేందుకు ఆర్థిక సమస్య అడ్డంకిగా మారడమే కారణం



యువతి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

గోపాలపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చదువుకు ఆర్థిక సమస్యలు అడ్డంకిగా మారడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ దుర్ఘటన మంగళవారం రాత్రి గోపాలపట్నంలోని ఇందిరానగర్‌లో చోటుచేసుకుంది. ఇందిరానగర్‌కు చెందిన వానపల్లి శృతి కీర్తన (18) ఇటీవల డిప్లొమా పూర్తిచేసింది. ఏపీఈసెట్‌లో 300 ర్యాంకు సాధించిన ఆమెకు ఇంజనీరింగ్‌లో చేరడానికి ఫ్రీ సీటు రాలేదు. కీర్తన తండ్రి సెల్‌ఫోన్ మెకానిక్‌గా పనిచేస్తున్నారు. ఉన్నత చదువులు చదవాలన్న కుమార్తె ఆసక్తిగా గమనించిన ఆయన ఎలాగైనా ఇంజనీరింగ్‌లో చేర్పించాలని కొద్దిరోజులుగా అప్పు కోసం ప్రయత్నిస్తున్నారు. మంగళవారం ఉదయం కొంత అప్పు చేశారు. అయితే తన చదువు కోసం తండ్రి అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతారని భావించిన కీర్తన మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పనిమీద బయటకు వెళ్లిన ఆమె తల్లిదండ్రులు రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటికి వచ్చారు. ఎంత పిలిచినా కుమార్తె తలుపులు తెరవకపోవడంతో బలవంతంగా వాటిని తెరిచారు. లోపల కీర్తన ఉరి వేసుకుని కనిపించడంతో విలపిస్తూ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు గోపాలపట్నం పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, కీర్తన ఆత్మహత్యకు కారణాలపై వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్ఐ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అశోక్‌గజపతిరాజుకు వైదికుల ఆశీర్వాదం



అశోక్‌గజపతిరాజుకు ఈవో సత్కారం

సింహాచలం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజును కేంద్ర ప్రభుత్వం గోవా రాష్ట్రానికి గవర్నర్‌గా నియమించడం పట్ల దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అభినందనలు తెలిపారు. మంగళవారం అప్పన్న ఆలయ వైదిక అధికారులు విజయనగరంలో అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, వేద పండితులు జగన్మోహనశర్మ చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలిచ్చారు.

వర్షాకాలంలో 7,00,000 మొక్కల పంపిణీ

(3వ పేజీ తరువాయి)

సిద్ధం చేశారు. స్వచ్ఛంద సంస్థలకు కూడా మొక్కలు అందజేయాలని నిర్ణయించారు. కాగా జిల్లాలో ఈ ఏడాది పది లక్షల మొక్కలు నాటాలని అధికార యంత్రాంగం లక్ష్యంగా నిర్ణయించింది. ఈ మొత్తం అటవీ శాఖ పరిధిలోని నర్సరీలు, ప్రైవేటు నర్సరీల నుంచి సమీకరించాలని అధికారులు నిర్ణయించారు.

మహా మాయ

(3వ పేజీ తరువాయి)

చెబుతున్నారు. ఒకవేళ వర్క్ డీవియేషన్‌కు వెళ్లాలనుకుంటే ముందస్తు ఆమోదం తీసుకోవడంతోపాటు టెండర్ పిలిచిన వర్కు స్వభావానికి తగిన పనికే ఆ మొత్తాన్ని సర్దుబాటు చేయాల్సి ఉంటుంది తప్పితే, ఫౌంటెయిన్ కోసం మంజూరుచేసిన గ్రాంటును ప్రహరీకి ఖర్చు చేయడానికి వీల్లేదని అంటున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో పెద్దఎత్తున అవినీతి జరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా పనులు జరిగినట్టు రికార్డులో చూపించిన అధికారులు ఎవరు?, వాటిని గుడ్డిగా ధ్రువీకరించి బిల్లుకు సిఫారసు చేసింది ఎవరు?...ఎవరి పాత్ర ఎంత?...అనేది ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి నిగ్గుతేల్చాల్సిన అవసరం ఉంది.

నగరంలో కిడ్నీ రాకెట్?

(3వ పేజీ తరువాయి)

లాగినట్టు సమాచారం. ఈ రాకెట్‌లో ప్రమేయం కలిగిన వారిని గుట్టుగా స్టేషన్‌కు పిలిచి వారి నుంచి భారీగా గుంజేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం పోలీస్ శాఖలోని నిఘా విభాగంలో పనిచేస్తున్న ఒక కానిస్టేబుల్‌కు తెలిసింది. తన పైఅధికారికి సమాచారం ఇస్తే ఇందులో ప్రమేయం ఉన్న ఒకరితో సదరు అధికారికి సన్నిహిత సంబంధాలు ఉండడంతో ఉన్నతాధికారి దృష్టికి వెళ్లకుండా తొక్కిపెట్టేస్తారని భావించారు. దీంతో తమ విభాగానికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో సమాచారాన్ని పోస్ట్ చేశారు. దీంతో విషయం నేరుగా సీపీకి చేరడంతో స్టేషన్ అధికారులు ఆగమేఘాల మీద ఈనెల 13న రాత్రి తొమ్మిది గంటల సమయంలో వాట్సాప్‌లో ఒక పోస్ట్ పెట్టి సమాచారాన్ని బయటకు వెల్లడించారు. హోటల్‌లో కిడ్నీల విక్రయం గురించి ఇద్దరు మాట్లాడుకుంటున్నట్టు సిబ్బంది ఇచ్చిన సమాచారంతో వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించి, మందలించి పంపించేశామన్నది వాట్సాప్‌లో పెట్టిన మెసేజ్ సారాంశం. అదే నిజమైతే గత నెల 30న జరిగిన ఘటనకు 15 రోజులు ఎందుకు దాచిపెట్టారనేది అర్థం కాని ప్రశ్నగా మారింది. అసలు వైద్యుడుగానీ ఎవరూలేరని, కేవలం ఇద్దరు వ్యక్తులే హోటల్‌లో ఉన్నారని చెబుతున్న పోలీసులు మంగళవారం కూడా హోటల్‌కు వెళ్లి దర్యాప్తు చేశారు. దీనిపై ఫోర్త్‌టౌన్ సీఐ సత్యనారాయణను వివరణ కోరగా ఆరోపణలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఈ ఉదంతంలో ఎవరినీ అరెస్టు చేయలేదని, గతంలో జరిగిన కిడ్నీ రాకెట్ కేసుల్లో నిందితులతో వీరికి ఏమైనా సంబంధాలు ఉన్నాయా?, వైద్యులు ఎవరైనా ఉన్నారా? అనేదానిపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. పట్టుబడిన వ్యక్తుల కాల్‌డేటా రాగానే వారి వెనుక ఉన్నవారి వివరాలు తెలుస్తాయని, ఈ కేసులో ఉన్నతాధికారుల పర్యవేక్షణలోనే దర్యాప్తు జరుగుతోంది కాబట్టి అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేదని స్పష్టంచేశారు.



విత్తనాలు అందజేస్తున్న కార్పొరేటర్ దాడి వెంకటేశ్

విత్తనాలు పంపిణీ

గోపాలపట్నం, జూలై 15(ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ అన్నారు. కొత్తపాలెం గ్రామంలో విత్తనాల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా దాడి వెంకటరమేశ్, కొత్తపాలెం పీఏసీఎస్ చైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్ రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడుతూ పీఏసీఎస్ పరిధిలోని రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు అందించే దిశగా కృషి చేస్తానని అన్నారు.

మోదకొండమ్మ ఆలయంలో అన్నసమారాధన

గోపాలపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరానగర్‌లో కొలువైన మోదకొండమ్మ నెల పండుగను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో మంగళవారం అన్నసమారాధన జరిగింది. ఈ సందర్భగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మంగళవారం మధ్యహ్నం జరిగిన అన్నసమారాధన కార్యక్రమాన్ని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్యసింహ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బొర్రమాంబకు ప్రత్యేక పూజలు

అగనంపూడి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత బొర్రమాంబకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయానికి రెయిలింగ్ వితరణ



పూజలో సాలాపు రామారావు దంపతులు

మల్కాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయానికి ఉన్న మెట్ల మార్గంలో రెయిలింగ్ అమర్చారు. ఈ సందర్భంగా దాతలు సాలాపు రామారావు అనురాధ దంపతలకు ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేయించారు. రెయిలింగ్ లేక మెట్లు ఎక్కడానికి వృద్ధ భక్తులు ఇబ్బందులు పడేవారు. ఈ విషయం గమనించిన సాలాపు రామారావు ఆలయనికి రెయలింగ్ వేయించారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 28, వంకాయలు (తెలుపు) 88, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 28, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 21, క్యారెట్ 44, దొండకాయలు 32, బంగాళదుంపలు 17, అరటికాయ(పె)10, మునక్కాడలు (కిలో) 52, అల్లం (పాతది) 48, బరబాటి 28, అగాకార కాయ 75, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్ద చిక్కుడు 50, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 36, కంద 54, గోరుచిక్కుడు 40, కూరపెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 10 0, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట)4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిదగుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మా మి డిఅ ల్లం 56, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160



గంగవరం పోర్టు రోడ్డులో భారీ వాహనం మూలంగా రేగిన దుమ్ము



వాహనాల మూలంగా దుమ్ము, ధూళితో నిండిన పోర్టు రోడ్డు

దుమ్ము, ధూళితో ఉక్కిరిబిక్కిరి

వృద్ధులు, చిన్నారులు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పోర్టు పరిసర ప్రాంతాల ప్రజల ఆవేదన

అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు

గాజువాక, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గంగవరం పోర్టు రోడ్డు పరిసర ప్రాంతాల ప్రజలు దుమ్ము, ధూళి సమస్యతో సతమతమవుతున్నారు. గంగవరం పోర్టు నుంచి జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ప్రధాన రహదారి మొత్తం దుమ్ము, ధూళితో నిండిపోవడంతో స్థానికులతో పాటు ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తమ దుస్తులు మట్టి రంగులోకి మారిపోతున్నాయని వాపోతున్నారు. ఈ రోడ్డులో నిత్యం రాకపోకలు సాగించే భారీ వాహనాల మూలంగా పెద్ద ఎత్తున దుమ్ము, ధూళి రేగి పరిసర ప్రాంతాల్లో చేరుతుండడంతో ఇళ్లు, డాబాలపై మట్టి పేరుకుపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ సమస్యను పరిష్కరించాలంటూ పలుమార్లు స్వతంత్రనగర్, కర్ణవానిపాలెం, శ్రీనగర్ అఫిషియల్ కాలనీ, తదితర ప్రాంతాల ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించడంతో పాటు నిరసన కార్యక్రమాలను కూడా చేపట్టారు. అయినప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. పెద్దఎత్తున వస్తున్న దుమ్ము, ధూళితో అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు,వృద్ధులు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దుమ్ము, ధూళి సమస్య పరిష్కారానికి పటిష్ఠ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

- సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మేయర్ పీలా శ్రీనివాసరావు, టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, గండి బాబ్జీ

పెందుర్తి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ విధ్వంస పాలన నుంచి కోలుకుని ఇప్పుడిప్పుడే రాష్ట్ర అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని గండి బాబ్జీ అన్నారు. కార్పొరేటర్ సేనాపతి వసంత ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ 97వ వార్డులో కార్మికనగర్, గిరిప్రసాద్‌నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పీలా శ్రీనివాసరావు, టీడీపీ ఇన్‌చార్జి గండిబాబ్జీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. మేయర్ పీలా మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పథకాల గురించి ప్రజలకు తెలియజేయండి

కూర్మన్నపాలెం (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన విజయాలను, ప్రభుత్వ పథకాలను విస్తృత ప్రచారం చేయాలనీ 87 వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. జీవీఎంసీ 87వ వార్డులో మహిళా సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళ అభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ ఫలాలు గురించి ప్రతి గడపకు చర్చాల్సిన బాధ్యత కార్యకర్తల మీద ఉందని అన్నారు.

సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా

కూర్మన్నపాలెం (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమ దిశగా అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఆశీర్వాదం ఉన్నాదని 86 వార్డు టీడీపీ అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 86వ వార్డులో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుని కరపత్రాల్లోని అంశాలను వివరించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. రాష్ట్ర భవిష్యత్తును మరింతగా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు

పెదగంట్యాడ (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వ వార్డులో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం దుర్గవానిపాలెంలో జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, ప్రధానకార్యదర్శి ములకలపల్లి పెంటయ్య ఇంటింటికీ వెళ్లి టీడీపీ అములు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి స్థానికులకు వివరించారు. పలు సంక్షేమ పథకాల గురించి మహిళలకు వివరించారు. వచ్చే రోజుల్లో ప్రభుత్వం మరికొన్ని పథకాలు అమలు చేస్తుందని వాటి గురించి వివరించారు.

ఎమ్మెల్యే పంచకర్లను కలసిన ఈఈ సింహాచలం

పెందుర్తి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును ఏపీఈపీడీసీఎల్ జోన్ 3 ఈఈగా బాధ్యతలు స్వీకరించిన బి. సింహాచలం నాయుడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే సబ్బవరంలో ఉన్న దామోదర సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్, దాసరి సూర్యప్రకాశరావు, విశాఖ ప్రాంతీయ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కింజరు ప్రభాకర్ ఎమ్మెల్యేను కలిశారు. అంతకుముందు ముఖ్యమంత్రి సహనిధి నుంచి సహాయం అందిన నలుగురు లబ్ధిదారులకు రూ.6.45 లక్షలు చెక్కులను ఎమ్మెల్యే అదంజేశారు.

నేడు పినగాడిలో ఎమ్మెల్యే పంచకర్ల పర్యటన

మండలంలోని పినగాడిలో బుధవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పర్యటించనున్నారు. గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ క్రమంలో పినగాడి, కోట్నివానిపాలెంలో సీసీ రోడ్లు, జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటి కుళాయిను ప్రారంభించనున్నారు.



ఎమ్మెల్యే పంచకర్లకు మొక్కను అందిస్తున్న ఈఈ

షిప్‌యార్డును సందర్శించిన కేంద్ర మంత్రి



కేంద్రమంత్రికి షిప్‌యార్డు చిత్రపటాన్ని చూపిస్తున్న దృశ్యం

మల్కాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)ను కేంద్ర మంత్రి సర్బనందా సోనోవాల్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ సీఎండీ హేమంత్ ఖత్రీ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం సంస్థలో పలు విభాగాలను వాటి పనితీరు గురించి ఆయనకు వివరించారు. అలాగే సంస్థలో పలు ఆర్డర్లు, నౌక నిర్మాణాలు, మరమ్మతులు తదితర అంశాల గురించి వివరించారు. ముఖ్యంగా ఫోకస్ ప్రాంతాలలో గ్రీన్ ట్యాగ్స్, హైడ్రోజన్ ఇంధన సెల్-శక్తితో కూడిన నాళాలు గురించి తెలిపారు. ప్లాట్ ఫాంలు నాళాలను నిర్మించడానికి సిద్ధంగా ఉన్నాయని తెలియజేశారు. భవిష్యత్‌లో దేశం సముద్ర సామర్థ్యాలను బలోపేతం చేయడానికి హెచ్‌ఎస్‌ఎల్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం అథారిటీ (వీపీఏ) చైర్మన్ డాక్టర్ మాధయ్యాన్ అంగముతు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి



సభలో మాట్లాడుతున్న ఈపీఎస్ భాగ్యలక్ష్మి

మల్కాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో వృద్ధి సాధించిన రోజే దేశం అభివృద్ధి చెందుతుందని జాతీయ సేవ పథకం జిల్లా నోడల్ అధకారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో నూతనంగా ప్రవేశించిన విద్యార్థులకు నిర్వహిస్తున్న మూడురోజుల ప్రత్యేక శిక్షణ శిబిరంలో ఆమె 'మహిళాభివృద్ధి' అనే అంశంపై మంగళవారం ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళాభివృద్ధి సాధించడం అందరూ చదుకుకోవాలని, నైపుణ్యాలు పెంచుకుని తద్వారా ఉపాధి పొందాలని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంటుల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు కల్పించాలని, మహిళల రక్షణ, భద్రతలపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని అన్నారు. 'బేటీ బచావో-బేటీ పడావో', 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' తదితర పథకాలను శక్తివంతంగా అమలు చేయాలని అన్నారు. అనంతరం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విదానాలపై కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి బి.శాంతి ఉపన్యాసం ఇచ్చారు. ఆత్మవిశ్వాసంతో అద్భుతాలు సాధించగలవని అన్నారు. తొలుత డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి మహిళ సాధాకారతకు డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ చేసిన సేవలను కొనియాడారు. నూతనంగా డిగ్రీలో జాయిన్ అయిన విద్యార్థులకు ఆమె స్వాగతం పలికారు.

ఇలా అయితే ప్రయాణం కష్టమే!

పెదగంట్యాడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ బీసీ రోడ్డులో పేరుకుపోయిన వ్యర్థాల గుట్టలను వెంటనే తొలగించాలని స్టీల్‌ప్లాంట్ కార్మికులు జీవీఎంసీ అధికాలరులకు విజ్ఞప్తి చేస్తున్నారు. గెడ్డ నుంచి తీసిన పూడికలను రోడ్డుపైన గుట్టలుగా వేయడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ఉక్కు కార్మికులు వాపోతున్నారు. గాజువాక, పెదగంట్యాడ, గంగవరం, దిబ్బపాలెం, నెల్లిముక్కు, దయాళ్ నగర్ ప్రాంతాల నుంచి ప్రతిరోజు వేలాదిమంది ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. వ్యర్థాలతో పాటు వీటి నుంచి వచ్చే నీరు వల్ల రోడ్డంతా బురదమయంగా మారింది. దీంతో రాత్రిళ్ల విధులకు వెళ్లేవారు, విధుల నుంచి తిరిగి వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై జీవీసంసీ అధికారులు స్పందించి రోడ్డుపై పేరుకపోయిన వ్యర్థాలను వెంటనే తరలించాలని కోరుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

అక్కిరెడ్డిపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్న 68వ వార్డు అప్పన్నకాలనీ ప్రాంతానికి చెందిన కొత్త మహేష్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ. 3.05 లక్షల చెక్కును గాజువాక సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనివాస్ బాధితునికి పార్టీ కార్యాలయంలో మంగళారం అందజేశారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతో బాధ పడేవారు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చొరవ తీసుకుని రిలీఫ్ ఫండ్ ఇచ్చేందుకు కృషి చేశారని అన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

ఆటోనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 71 వార్డు తోకాడలో మంగళవారం వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీల సమస్యలు పరిష్కరించాలని, వీధి దీపాలను వెలిగే విధంగా చూడాలని తదితర సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన రాజాన మాట్లాడుతూ సమస్యలను ఎమ్మెల్యే పల్లా, జీవీఎంసీ కమీషనర్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ



మహిళకు కుట్టు మిషన్ అందిస్తున్న దృశ్యం

ఆటోనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సేవ చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పుచ్చా విజయ కుమార్, టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు పప్పు రాజారావు అన్నారు. జీవీఎంసీ 71వ వార్డు శ్రీనగర్‌లో సీఎల్‌సీ సంస్థ చైర్మన్ బిషప్ మహంతి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సంస్థ కుట్టు మిషన్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. దశాబ్ద కాలంగా పేదలకు, నిరాశ్రయులకు సేవలందిస్తూ, వైద్య, రక్తదాన శిబిరాలు తదితర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ బిషప్ మహంతి మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు.

ఘనంగా జువ్వాలమ్మ జాతర

వేపగుంట, జూలై 15(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు గౌతమ్‌నగర్‌లో కొలవైన శ్రీ జువ్వాలమ్మ అమ్మవారి మారువారం పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పోయిన వారం మొక్కులు చెల్లించుకోని భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.



ట్యాబ్‌లు పంపిణీ అనంతరం ఆర్పీలతో ఎమ్మెల్యే గణబాబు

ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ

గోపాలపట్నం, జూలై 15(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేసి మహిళలు ఆర్థిక సాకారత సాధించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గోపాలపట్నంలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో 56, 63 వార్డుల మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు మంగళవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధి దిశగా డ్వాక్రా సంఘం మహిళలను ముందుకు నడిపించడానికి ఆర్పీలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా గణబాబు ఆర్పీలకు ట్యాబ్‌లు అందించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, కూటమి నేతలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- అఖిలపక్ష సంఘం నాయకుల డిమాండ్

ఉక్కుటౌన్‌షిప్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఉక్కు అఖిలపక్ష కాంట్రాకు కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాటాడుతూ కార్మికుల తొలగింపులను యాజమాన్యం ఆపాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాకు కార్మికులను ఇప్పుడు తొలగించడం వల్ల వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేస్తుంటే కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైన తమ వైఖరిని మార్చుకోలవాని, కార్మిక వర్గానికి న్యాయం చేయాలని కోరారు.

పారిశ్రామిక సందర్శనలో విజ్ఞాన్ విద్యార్థులు



పారిశ్రామిక సందర్శనలో పాల్గొన్న విద్యార్థులు

అగనంపూడి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఎం విద్యార్థులు మంగళవారం స్టీల్‌ప్లాంట్, మెడిటెక్ జోన్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా మెడిటెక్ జోన్‌లో వివిధ ప్రోస్తెటిక్స్, ఆర్థోటిక్స్ పరికరాల తయారి విధానం గూరించి అక్కడ పనిచేస్తున్న ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. గామా రేడియేషన్ లేజర్ కేంద్రాలు, త్రీడీ ప్రింటింగ్ వంటి అంశాల గూరించి ఈసీఎం విభాగాధిపతి హెచ్. దేవన్న వివరించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ అధ్యాపకులు పాల్గొన్నారు.

'పెందుర్తి' కాంగ్రెస్ కన్వీనర్‌గా విన్నకోట రాము



విన్నకోట రాము

పెందుర్తి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పెందుర్తి అసెంబ్లీ నియోజవర్గ కన్వీనర్‌గా విన్నకోట రాము నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పెందుర్తి ప్రాంతానికి చెందిన విన్నకోట రాము నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో కొనసాగుతూ పార్టీలో జిల్లా, నగర స్థాయిలో పదవులు నిర్వహించి, షిప్‌యార్డ్‌లోని ఐఎన్‌టీయూసీ కార్యాలయ బేరర్‌గా మూడు పర్యాయాలు పని చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అసెంబ్లీ సమన్వయకర్త విన్నకోట రాము మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేస్తానని అన్నారు. తనకు కీలక బాధ్యతలు అప్పగించిన షర్మిలరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కాలుష్య నివారణకు అమ్మ పేరిట మొక్కలు



శాతవాహన నగర్‌లో మొక్కలను నాటుతున్న బీజేపీ నాయకులు

కూర్మన్నపాలెం,జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పిలుపుతో కాలుష్య నివారణకు అమ్మ పేరుతో మొక్క నాటే కార్యక్రమాన్ని వాకర్స్ ఆధ్వర్యంలో మంగళవారం రావుల చెరువు ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బొండా ఎల్లాజీ, శ్రీదేవి పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు పెంచితే కాలుష్య నివారణ సులభంగా జరుగుతుందని అన్నారు.

తప్పుడు రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు

అగనంపూడి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తమ స్థలాన్ని వేరే వ్యక్తి తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పినమడకకు చెందిన మేడిశెట్టి శారద అనే మహిళ డిప్యూటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. 2015లోనే తాను ఈ స్థలాన్ని కొనుగోలు చేసినట్టు వెల్లడించారు. స్థలం సర్వే నంబరు 203/2లో అయితే సదరు వ్యక్తి తప్పుడు సర్వే నంబరు 144గా వేసి రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. ఈ విషయాన్ని జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన తరువాత నోటీసులు జారీ చేశారని చెప్పారు.

'నిరాహారదీక్షలకు అనుమతి ఇవ్వాలి'

ఉక్కుటౌన్‌షిప్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేఖంగా చేపట్టిన నిరాహారదీక్ష స్థలం వద్ద ఉక్కు యాజమాన్యం ఆంక్షలు విధించడం సరికాదని ఉక్కు పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. నాలుగేళ్లగా పోరాటాలు చేస్తున్నామని, ఈ క్రమంలోనే ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా నేటి వరకు కాపావడుకున్నామని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్లాంట్‌ను కాపాకుడునేందుకు చేస్తున్న రిలే నిరాహార దీక్ష స్థలం వద్ద ఆంక్షలు విధించిన పోరాటాలు ఆపేది లేదని, ప్లాంట్ కోసం ఎంతటి త్యాగాలకైన సిద్ధమన్నారు.

బోరు పనుల నిలిపివేతపై నిరసన



బిందెలతో నిరసన తెలపుతున్న మాజీ డిప్యూటీ మేయర్ శ్రీధర్, స్థానికులు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు గౌరీనగర్ రిక్షా కాలనీలో కూటమి నాయకులు బోరింగ్ పనులను అడ్డుకుంటున్నారంటూ మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వార్డులో బోర్ల నిర్మాణానికి జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. వీటి ప్రారంభోత్సవానికి కూటమి నాయకులకు తెలియకుండా మాజీ డిప్యూటీ మేయర్ శ్రీధర్ శంకుస్థాపన చేయడంతో నాయకులు మండిపడ్డారు. ఆయా పెండింగ్ పనులను ప్రజాదరార్ ద్వారా గణబాబు పరిష్కరించారని వార్డు అధ్యక్షుడు వైటీఆర్ పేర్కొన్నారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ఇరువర్గలకు ఒకేసారి వెళ్లడంతో వివాదం తలెత్తింది. దీంతో నీటి సరఫర అధికారులు బోరు పనులు నిలిపివేశారు. దీంతో జియ్యాని శ్రీధర్, కాలనీ వాసులు బిందెలతో నిరసన చేశారు.

ఎక్సలెన్స్ సేవలు షురూ..



సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ మెంటల్ కేర్ భవనం. (ఇన్‌సెట్లో) మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి

- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మానసిక ఆస్పత్రి అప్‌గ్రేడేషన్‌తో మరిన్ని మెరుగైన సేవలు
- దేశవ్యాప్తంగా 26 ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసిన కేంద్రం
- ఏపీలో విశాఖ ఆస్పత్రికే అవకాశం
- నాలుగు కోర్సుల నిర్వహణతో అందుబాటులోకి రానున్న మానసిక నిపుణులు

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో మానసిక సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఏటా కొన్ని లక్షల మంది మానసిక సమస్యల బారినపడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మానసిక రోగులకు అవసరమైన కౌన్సెలింగ్, వైద్య సేవలందించే నిపుణుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. భవిష్యత్తులో పెరగనున్న మానసిక సమస్యలకు మెరుగైన వైద్య సేవలందించే నిపుణుల సంఖ్యను పెంచే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మానసిక ఆస్పత్రులను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేసే కార్యక్రమానికి ఎనిమిదేళ్ల కిందట శ్రీకారం చుట్టింది. దేశంలోని 26 ప్రభుత్వ మానసిక ఆస్పత్రులను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అప్‌గ్రేడ్ చేయగా.. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖలో ఉన్న మానసిక ఆస్పత్రిని కూడా ఇందుకోసం ఎంపిక చేసింది. అప్‌గ్రేడేషన్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో సుమారు రూ.29.70 కోట్లు వెచ్చించి అధునాతన భవనాలను నిర్మించారు. ఈ భవన నిర్మాణాలు పూర్తయిన రెండేళ్ల తరువాత మంగళవారం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు.

దీంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సేవలు అందించే దిశగా కీలకమైన అడుగు పడినట్టయింది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా పూర్తి స్థాయిలో సేవలందించే స్థితికి చేరుకుంటే మానసిక రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించడంతోపాటు సమాజానికి అవసరమైన మానసిక నిపుణులు ఇక్కడ నుంచి రానున్నారు.

మానసిక రోగులకు భరోసా..

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అప్‌గ్రేడేషన్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే మానసిక సమస్యలతో బాధపడే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు అవకాశం ఉంది. ఆస్పత్రిలో అదనంగా 80 పడకలు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో వృద్ధులకు 20, చిన్నారులకు 20, వ్యసన విముక్తికి సంబంధించి మరో 40 పడకలు ఉంటాయి. ఇందుకోసం చైల్డ్ సైకియాట్రీ, జీరియాట్రిక్ బ్లాక్, డీ-అడిక్షన్ వార్డు, రీహాబిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ విభాగాల్లో పని చేసేందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించుకోనున్నారు.

కోర్సులతో నిపుణులు..

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో భాగంగా పారా సైకాలజీ కోర్సులను నిర్వహించనున్నారు. సైకియాట్రిక్ నర్సింగ్, క్లినికల్ సైకాలజీ, సైకియాట్రిక్ సోషల్ వర్క్ విభాగాలు అందుబాటులోకి వస్తాయి. ఒక్కో విభాగంలో 30 మందికి ప్రవేశాలు కల్పించి కోర్సులను నిర్వహించనున్నారు. ఈ కోర్సుల ద్వారా రెండేళ్లకొకసారి ఆయా విభాగాలకు చెందిన నిపుణులు 30 మంది చొప్పున అందుబాటులోకి వస్తారు. వీరిద్వారా అనేక మంది మానసిక రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది. ఈ కోర్సుల నిర్వహణకు రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్ సీఐ) అనుమతి కావాలి. ఇప్పటికే ఎన్ టీఆర్ విశ్వవిద్యాలయం, డీఎంఈ అధికారులకు ఆస్పత్రి అధికారులు కోర్సుల నిర్వహణకు అనుమతి ఇవ్వాలంటూ కోరారు. ఉన్నతాధికారులు ఆర్‌సీఐ నుంచి అనుమతి తీసుకున్న వెంటనే ఆయా కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. కోర్సుల నిర్వహణకు అనుగుణంగా నిపుణులు అందుబాటులో ఉన్నారని, వీరి ద్వారా రెండు కోర్సులను నిర్వహించుకునే సామర్థ్యం కలిగి ఉన్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి తెలిపారు. ఇదే విషయాన్ని మంత్రికి తెలియజేశామని, కొద్ది రోజుల్లోనే కోర్సుల నిర్వహణకు అనుమతి లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

మద్యం మత్తులో యువకుల హల్‌చల్

- ప్రశ్నించిన వ్యక్తిపై బీరు బాటిళ్లతో దాడి చేయడంతో తీవ్ర గాయాలు
- 11 మందిని అరెస్టు చేసిన పోలీసులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జీవన్‌కుమార్

గాజువాక, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఎందుకు గొడవ చేస్తున్నారని ప్రశ్నించినందుకు గాను మద్యం మత్తులో ఉన్న యువకులు ఓ వ్యక్తిపై బీరు బాటిళ్లతో దాడి చేసిన సంఘటన సోమవారం అర్ధరాత్రి గాజువాక బీసీ రోడ్డు ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీసీ రోడ్డులో నివాసం ఉంటున్న జీవన్‌కుమార్ తమ ఇంటి ముందు కారు పార్కు చేశారు. సోమవారం అర్ధరాత్రి ఒంటిగంటప్పుడు కొంతమంది యువకులు ఆ కారు వద్ద పెద్దగా అరుస్తూ గొడవ పడుతున్నారు.

దీంతో జీవన్‌కుమార్ ఇక్కడెందుకు గొడవ చేస్తున్నారని, వెళ్లిపోండని చెప్పి ఇంట్లోకి వెళ్లిపోయారు. అయితే కొంత సమయం తరువాత పలువురు యువకులు జీవన్‌కుమార్ ఇంటి గోడ ఎక్కి తద్వారా పైఅంతస్తుకు చేరుకుని పూల కుండీలను విరగ్గొట్టడంతో పాటు తలుపులు కొట్టడంతో జీవన్‌కుమార్ బయటకు వచ్చారు. ఆ సమయంలో గాజువాక ప్రాంతానికి చెందిన దనాల అప్పలరాజు (21), మజ్జి వెంకటరమణ (22), షేక్ బషీర్ (19), మోహన్ కార్తీక్ (21)లు బీరు బాటిళ్లతో జీవన్‌కుమార్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కిందనున్న మరో ఏడుగురు పెద్దగా కేకలు వేస్తూ జీవన్‌కుమార్‌ను కిందకు తీసుకురావాలని, చంపేస్తామని అరిచారు. అయితే ఆ అరుపులకు స్థానికులు అక్కడకు చేరుకోవడంతో అందరూ పారిపోయారు. కుటుంబ సభ్యులు జీవన్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు 11మందిని అరెస్టు చేశారు. అర్ధరాత్రి వేళ మద్యం మత్తులో స్థానికులను భయభ్రాంతులకు గురిచేసిన యువకులపై రౌడీషీట్ తెరుస్తామని పోలీసులు పేర్కొన్నారు.

మాడవీధిలో పాము కలకలం



మొక్కలో కర్రలా కనిపిస్తున్న పాము

సింహాచలం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి మాడవీధిలో పాము కలకలం రేపింది. మంగళవారం ఉదయం ప్రధాన రాజగోపురం పాత పీఆర్‌ఓ కార్యాలయం నుంచి టికెట్ల స్కానింగ్ సెంటర్ వరకు పలుమార్లు అటుఇటు తిరిగింది. భక్తులు భయాందోళనకు గురై పరుగులు పెట్టారు. మరికొందరు దాన్ని తరిమే యత్నం చేయగా అక్కడున్న మొక్కలో దూరింది. కొద్దిసేపటి తరువాత తుప్పల్లోకి వెళ్లిపోవడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

హిందీని బలవంతంగా రుద్దం

- విశ్వ హిందూ పరిషత్ జాతీయ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వ హిందూ పరిషత్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

సిరిపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): హిందీనే కాదు.. మరే ఇతర భాషను ప్రజలపై బలవంతంగా రుద్దే ఉద్దేశం కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేదని విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ స్పష్టం చేశారు. మన దేశంలో వాడుకలో ఉన్న 22 భాషల్లో హిందీ కూడా ఒకటన్నారు. మంగళవారం ఆంధ్ర యూనివర్సిటీ హిందీ భవనం సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎన్ని భాషలు నేర్చుకుంటే వారికి వ్యక్తిగతంగా ప్రయోజనం ఉంటుంది తప్ప ఆయా భాషలకు ఉండదన్నారు. మాతృభాషను తొలుత గౌరవించుకోవాలని, తదుపరి ఇతర భాషలు నేర్చుకోవచ్చునని తెలియజేశారు. మాతృభాష అమ్మవంటిదని, మిగతావన్నీ పెద్దమ్మ భాషలేనన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షాలు సైతం భారతీయ భాషల వికాసంలోనే హిందీ వికాసం ఉందని చెప్పారన్నారు. ఇటీవల హిందీ భాష సమ్మేళనంలో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ హిందీ భాష పెద్దమ్మ వంటిదని అన్నారని, అయితే కొందరు సరిగ్గా అర్థం చేసుకోలేదన్నారు.పవన్‌కల్యాణ్ హిందీ భాష ప్రావీణ్యత గురించి చేసిన వ్యాఖ్యలకు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ప్రతీ ఒక్కరూ తమకు నచ్చిన భాషను నేర్చుకునే స్వేచ్ఛ ఉందని, ఎవరినీ ఏ భాష నేర్చుకోవాలంటూ ఒత్తిడి చేసేది లేదన్నారు. ఈ సమావేశంలో ఆర్గనైజర్లు రామకృష్ణ కంచర్ల, బచ్చల రవి, ఏవీఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

రైళ్ల కార్యకలాపాల నిర్వహణకు ఎంఆర్‌ఐ ఆధునిక సాంకేతికత



విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైళ్ల కార్యకలాపాల నిర్వహణకు సంబంధించి విద్యుత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆధునిక ఎంఆర్‌ఐ సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చామని డీఆర్ఎం లలిత్ బొహ్రా పేర్కొన్నారు. లోకోమోటివ్‌ల పైకప్పుపై అమర్చిన పాంటోగ్రాఫ్, రైలుకు విద్యుత్‌ను సరఫరా చేసే ఓవర్ హెడ్ కేటనరీతో కలిపి ఎంఆర్‌ఐ పనిచేస్తుందన్నారు. ఓవర్ హెడ్ వైరింగ్ వైఫల్యాలను సకాలంలో గుర్తించి ప్రమాద సంకేతాలు తెలియజేయడమే కాకుండా ఓవర్ హెడ్ ఎక్యూప్‌మెంట్‌లో వచ్చే మార్పులను విశ్లేషించేందుకు ఉపయోగపడుతుందన్నారు. పాంటోగ్రాఫ్‌లో తలెత్తే సమస్యలు, కండక్టర్‌లో ఏర్పడే విభజనలు వంటివి నివారించడానికి సహాయపడుతుందన్నారు. జీపీఎస్ డేటాను ఉపయోగించి ఓవర్ హెడ్ ఎక్యూప్‌మెంట్ (ఓహెచ్‌ఈ) పరిమితులను నిరంతరం పర్యవేక్షించి సురక్షిత, నమ్మకమైన రైళ్ల కార్యకలాపాలకు మెజర్ (కొలత), రికార్డింగ్, ఇన్స్ట్రుమెంటేషన్ (ఎంఆర్‌ఐ) ఆధునిక స్కాన్ పరికరాలు దోహదపడతాయని తెలిపారు. విద్యుత్ ట్రాక్షన్ కార్యకలాపాలకు సంబంధించి భద్రత, సామర్థ్యాన్ని కొనసాగించడంతోపాటు ప్రతికూల వాతావరణ పరిస్థితులలో ఓహెచ్‌ఈతో పాంటోగ్రాఫ్ చిక్కుకుపోవడాన్ని నివారించేందుకు ఎంఆర్‌ఐ పనిచేస్తుందన్నారు.

ట్రాయ్ ఐడీటీ టెస్టులో జియో టాప్

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో నిర్వహించిన ట్రాయ్ ఇండిపెండెంట్ డ్రైవ్ టెస్ట్ (ఐడీటీ)లో రిలయన్స్ జియో టాప్‌లో నిలిచినట్టు ఆ సంస్థ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. నెట్‌వర్క్ లభ్యత, బ్రాడ్ బ్యాండ్ సేవలు, యాక్సెస్‌బిలిటీ, రిటైనబిలిటీలో జియో మంచి పనితీరు ప్రదర్శించింది. విశాఖ నగరంలోని సిరిపురం, ఐటీ పార్కు, బీచ్, ఎంవీపీ కాలనీ, రుషికొండ, భీమిలి, గాజువాక, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, విమానాశ్రయం వంటి కీలక ప్రాంతాల్లో నెట్‌వర్క్‌ను పరీక్షించారు. ఫెర్రీ బోట్ లైన్, రాంబిల్లి నేవల్ డాక్‌యార్డ్ వంటి తీర ప్రాంతాల్లోనూ ఇది బాగా కనెక్ట్ అవుతున్నట్టు తేలింది. 99.83శాతం కాల్ సెటప్ సక్సెస్ రేటుతో ముందున్నట్టు పేర్కొంది. సగటున 204.91 ఎంబీపీఎస్ డౌన్‌లోడ్ వేగం, 18.02 ఎంబీపీఎస్ అప్‌లోడ్ వేగాన్ని నమోదు చేసిందది. ఇది పోటీదారుల కంటే ముందున్నట్టు వెల్లడించింది. ఐడీటీ కవరేజ్ ప్రాంతంలో జీరో కాల్-డ్రాప్ రేటును సాధించినట్టు తెలిపింది.

ఇంటర్ బ్రిడ్జి కోర్సు అభ్యర్థులకు 19న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

కంచరపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ బ్రిడ్జి కోర్సు (ఐబీసీ) పూర్తిచేసిన అభ్యర్థులు నేరుగా పాలిటెక్నిక్ రెండో ఏడాదిలో ప్రవేశాలకు గాను స్పాట్ అడ్మిషన్లు ఈ నెల 19న కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్టణం జిల్లాలో సీట్లు కావాల్సిన అభ్యర్థులు లేటరల్ ఎంట్రీ కోసం ఈ నెల 18లోగా దరఖాస్తు చేయాలని సూచించారు. దరఖాస్తుదారులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో 19న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుంది. సీటు పొందిన అభ్యర్థులు ఫీజు కింద ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రూ.6 వేలు, ప్రైవేటు కళాశాలైతే రూ. 26 వేలు తక్షణమే చెల్లించాల్సి ఉంటుంది.

అశోక్‌కు క్షత్రియ సమితి సన్మానం



అశోక్‌గజపతిరాజును సన్మానిస్తున్న క్షత్రియ సమితి సభ్యులు

భీమునిపట్నం (రూరల్), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గోవా రాష్ట్రానికి గవర్నరుగా నియమితులైన పూసపాటి అశోక్‌గజపతిరాజును విజయనగరంలోని ఆయన స్వగృహంలో క్షత్రియ సమితి నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు వెంకటపతిరాజు (పెదబాబు) మాట్లాడుతూ వివాదాలకు దూరంగా ఉండే అశోక్‌గజపతిరాజుకు గవర్నర్ పదవి రావడ ం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం అశోక్‌ను దుశ్శాలువాతో సత్కరించా పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు, క్షత్రియ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదాల్లో వారే బలి

... 5వ పేజీ తరువాయి

సంబంధం లేని విభాగాలను ప్రొడక్షన్ బ్లాక్‌కు దూరంగా ఉంచాలని చెబుతున్నారు.

250 మంది దాటితే సేఫ్టీ ఆఫీసర్ తప్పనిసరి

ఇప్పటివరకూ ఫార్మా కంపెనీలలో వేయి మంది వర్కర్లు ఉంటనే సేఫ్టీ ఆఫీసర్‌ను నియమించుకోవాలనే నిబంధన ఉండేది. ఇటీవల కేంద్రం దానిని సవరించి 250 మంది ఉంటే సేఫ్టీ ఆఫీసర్ తప్పనిసరి అని స్పష్టంచేసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా జీఓ జారీచేసింది. దీనిని అమలు చేయాల్సి ఉంది. ఫార్మా కంపెనీల్లో పొగ వచ్చినా, మంట వచ్చినా, రసాయనాల వాసన వచ్చినా వాటిని పసిగట్టి హెచ్చరించే సెన్సార్లు ఉంటాయి. అయితే ప్రమాదాలు జరిగినా యాజమాన్యాలు కొన్నింటిని కప్పిపుచ్చడం, వాస్తవాలు వెల్లడించకపోవడం జరుగుతోంది.

ఇకపై అలాంటి వాటికి అవకాశం లేకుండా సెన్సార్లు అన్నింటినీ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ)కి కనెక్ట్ చేయాలని ఫ్యాక్టరీస్ విభాగం ఆదేశించింది. వాటిని ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌తో పాటు ఫార్మా సిటీలోని అసోసియేషన్ భవనం(ఎంఎఎస్ఆర్ఎం)కు కూడా అనుసంధానం చేయాలని అధికారులు ఆదేశించారు. అలాగే ఏపీఐఐసీకి కూడా ఆ సమాచారం వెళ్లేలా చూడాలని సూచించారు. దీనివల్ల ఎటువంటి ప్రమాద సమాచారమైనా తక్షణమే కంపెనీ బయట ఉండేవారికి కూడా వెళ్లి, వెంటనే సహాయక చర్యలు చేపట్టడానికి వీలుంటుంది.

పార్కుల్లో ఆక్రమణల తొలగింపు

... 5వ పేజీ తరువాయి

లేఅవుట్ పార్కుకు వెళ్లారు. అక్కడ పొదలు, చెత్తాచెదారాలను యంత్రాలతో తొలగించి చదును చేయించారు. పార్కులోపల షెడ్‌ను ఎవరు నిర్మించారో ఆరా తీశారు. పార్కులో కొంతస్థలం ఆక్రమణకు గురైనట్టు అనుమానాలు ఉండడంతో ఈటీఎస్ సర్వే చేయించాలని అధికారులు నిర్ణయించారు. మిగిలిన పార్కుల్లో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుందని సిబ్బంది చెబుతున్నారు

అందరి సహకారంతోనే ఆరోగ్య ఆంధ్రప్రదేశ్

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



గీతం ఆస్పత్రిలో ఎమర్జెన్సీ విభాగాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, పక్కన ఎంపీ శ్రీభరత్, సీపీ శంఖబ్రాత బాగ్చి

ఎండాడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలందించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడంలో ప్రైవేట్ ఆస్పత్రుల సహకారం ఎంతైనా ఉందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభిప్రాయపడ్డారు. మంగళవారం ఆయన గీతం ఆస్పత్రిలో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన 40 పడకల ఎమర్జెన్సీ విభాగంతో పాటు ఆపరేషన్ థియేటర్లను ఎంపీ శ్రీభరత్, సీపీ డాక్టర్ శంఖబ్రాత బాగ్చితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలందించడానికి గీతం ఆస్పత్రిలో పలు విభాగాలను అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ సామాన్యులకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా గీతం ఆస్పత్రి పనిచేస్తుందన్నారు. జిమ్సర్ ప్రో వీసీ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ గీతం ఆస్పత్రిని 750 పడకలతో, 16 మేజర్ ఆపరేషన్ థియేటర్లు, 3 మైనర్ థియేటర్లు, అధునాతన డయాలసిస్ యూనిట్, కేథ్ ల్యాబ్, ఇంటెన్సివ్ కేర్ యూనిట్,రేడియాలజీ పెయిన్ క్లినిక్‌తో తీర్చిదిద్దినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో గీతం విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు ఎం.గంగాధరరావు, వీసీ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గుణశేఖరన్, జిమ్సర్ కళాశాల డీన్ డాక్టర్ ఎస్వీ రావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీవీ నరసింహరావు, డాక్టర్ కృష్ణకార్తీక్ భోగవిల్లి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయినా రిలీవ్ చేయరు!

- ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో పలువురు ఉద్యోగుల అవస్థలు
- అంతా ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులే
- ఆయా స్థానాల్లో పనిచేసేందుకు మరొకరు రాకపోవడమే కారణమంటున్న అధికారులు



విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో ఇటీవల వందలాది మంది ఉద్యోగులకు బదిలీలు అయ్యాయి. ప్రాంతీయ కార్యాలయ పరిధిలో 740 మందిని ప్రస్తుతం పనిచేస్తున్నచోట నుంచి మరోచోటకు మార్చారు. అయితే, నాలుగైదు కేడర్లకు చెందిన సుమారు 60 మందిని బదిలీ చేసినా రిలీవ్ చేయకపోవడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. అంతా ఉమ్మడి ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులే కావడం గమనార్హం.

గడిచిన కొన్నేళ్లుగా ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను తాజాగా చేపట్టిన బదిలీల్లో మైదాన ప్రాంతాలకు అధికారులు బదిలీ చేశారు. వీరిలో ఎంపీహెచ్‌ఈవో, ఫార్మసీ ఆఫీసర్, పీహెచ్‌ఎన్, స్టాఫ్ నర్సు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, తదితర కేడర్లకు చెందిన ఉద్యోగులు ఉన్నారు. వీరంతా ఆయా ప్రాంతాల్లో ఐదేళ్లకుపైబడి పనిచేయడంతో వారు కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేశారు. అయితే, బదిలీ అయిన ఉద్యోగులను అక్కడి అధికారులు రిలీవ్ చేయడం లేదు. దీంతో సదరు ఉద్యోగులు బదిలీ అయిన ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఆర్డీ డాక్టర్ రాధారాణిని కలిసి వారంతా వినతిపత్రం సమర్పించి, తమకు న్యాయం చేయాలని కోరారు. ఏళ్ల తరబడి ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న తమకు మైదాన ప్రాంతాలకు వెళ్లే అవకాశం వచ్చిందని, అయినప్పటికీ అధికారులు రిలీవ్ ఆర్డర్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీలతో ఇబ్బందులు..

ప్రస్తుతం బదిలీ అయిన ఉద్యోగుల స్థానంలో మరొకరు రాకపోవడం వల్లే వారిని రిలీవ్ చేయలేదని తెలుస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో మరో ఉద్యోగి రాకపోతే... బదిలీ అయినప్పటికీ వారిని రిలీవ్ చేయకూడదని సంబంధించిన ఉత్తర్వుల్లోనే స్పష్టంగా ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులు వెళ్లిపోతే గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలపై ప్రభావం పడుతుందన్న ఉద్దేశంతో రిలీవ్ చేయడం లేదని చెబుతున్నారు. దీనిపై ఆర్డీ డాక్టర్ రాధారాణిని వివరణ కోరగా...సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కొద్దిరోజుల్లో పదోన్నతులు నిర్వహించనున్నారని, అనంతరం బదిలీ అయిన ఉద్యోగులను రిలీవ్ చేస్తారని వెల్ల డించారు.

పేదల కోసం ఆస్పత్రులు నిర్మించని వైసీపీ

- వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శ
- పెదవాల్తేరులో ఆయుష్మాన్‌భవ ఆరోగ్య కేంద్రం ప్రారంభం



ఆరోగ్య కేంద్రంలోని బెడ్‌లను పరిశీలిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్. చిత్రంలో ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యేలు వెలగపూడి, విష్ణుకుమార్‌రాజు, తదితరులు

పెదవాల్తేరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పెదవాల్తేరు పోలమాంబ అమ్మవారి దేవాలయం ఎదురుగా ఉన్న ఆయుష్మాన్‌భవ ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ప్రారంభించారు. ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్సీ వి.చిరంజీవిరావు, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యాదేవి తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ విశాఖకు 48 యూపీహెచ్‌ఎల్ మంజూరయ్యాయన్నారు. ఆయుష్మాన్ ద్వారా రూ.200 కోట్లు కేంద్రం నుంచి వచ్చే అవకాశం ఉన్నా గత ప్రభుత్వ నిర్వాకం వల్ల కేవలం రూ.38 కోట్లు మంజూరయ్యాయన్నారు. భూమి ఆక్రమించి పార్టీ కార్యాలయాలు నిర్మించుకున్నారే తప్ప పేదల కోసం ఎటువంటి ఆస్పత్రులు నిర్మించలేదన్నారు. పరామర్శల పేరిట దండయాత్రలు చేస్తున్నారని విమర్శించారు. సొంత కార్యకర్తల ప్రాణాలను పణంగా పెట్టి దాడులను ప్రోత్సహిస్తున్నారన్నారు. స్టేట్ క్యాన్సర్ సెంటర్ 2018లో మంజూరైతే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుల సహకారంతో రాష్ట్రంలో వైద్య రంగంలో సంస్కరణలు తెచ్చామని పేర్కొన్నారు.

లింక్డ్ఇన్ నివేదికలో దేశంలో నంబర్‌వన్‌గా విశాఖ

నగరాల్లో ప్రథమ స్థానం: ఎంపీ ఎం.శ్రీభరత్

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): లింక్డ్ఇన్ నివేదిక ప్రకారం ఉద్యోగ అవకాశాలపరంగా దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖపట్నం నంబర్‌వన్‌గా నిలిచిందని ఎంపీ ఎం.శ్రీభరత్ ఒక ప్రకటనలో తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవడం, టెక్నాలజీ, ఫార్మా సంస్థలు ఏర్పాటుకావడం వంటి అంశాలు ఈ అభివృద్ధికి కారణమవుతున్నాయని పేర్కొన్నారు. ఇది ప్రజలందరికీ గర్వకారణమైన విషయమన్నారు. ప్రభుత్వాలు, పరిశ్రమలు, యువత, ప్రతిభావంతుల కృషికి ప్రతిఫలమన్నారు. ఇప్పుడు విశాఖ ఉద్యోగాలు కల్పించే, కొత్త ఆవిష్కరణలు తీసుకొచ్చే ఒక జాతీయ కేంద్రంగా మారుతుందని తన ప్రకటనలో పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలు, డిజిటల్ అభివృద్ధి, ప్రతిభ కలగలసి త్వరలో విశాఖపట్నం దేశంలో అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా మారుతుందని నమ్ముతున్నామని పేర్కొన్నారు.

స్టీల్ ప్లాంటులో రెండో విడత వీఆర్‌ఎస్‌కు 1,152 మంది దరఖాస్తు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో రెండో విడత వీఆర్‌ఎస్ తీసుకునేందుకు సుమారు 1,152 మంది దరఖాస్తు చేసుకున్నట్టు కార్మిక సంఘ నాయకులు తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారం చివరి తేదీ కాగా, ఉపసంహ రణకు ఈ నెల 18 వరకు అవకాశం ఉంది. తొలిసారి వీఆర్‌ఎస్ ప్రకటించినప్పుడు 1,160 మంది ఉద్యోగులు వీఆర్‌ఎస్ తీసుకున్నారు. కాగా రెండో విడత ఎంతమందికి వీఆర్‌ఎస్‌కు అవకాశం కల్పిస్తారన్న దానిపై స్పష్టత లేదు. సంస్థలో పదిహేనేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని 45 ఏళ్లు దాటిన వారందరూ ఈసారి వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసేందుకు అర్హులుగా యాజమాన్యం పేర్కొంది.